


శుక్రవారం ఉష్ణోగ్రతలు | గరిష్టం : 36.0°C | కనిష్టం : 23.5°C



రంజాన్ వేళలు
ఇఫ్తార్ : శనివారం సా : 6.32 గం..
సహర్ : ఆదివారం ఉ : 5.01 గం..



వద్దన్నా.. వినడంలే..

ప్రభుత్వం డిప్యుటేషన్లను రద్దు చేసినా.. పాత స్థానాల్లోనే విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగులు

- రెగ్యులర్ స్థానాల్లో సిబ్బంది లేక రోగుల ఇబ్బందులు
- అత్యవసరం పేరిట మళ్లీ వారికే ఆర్డర్లు
- వైద్య ఆరోగ్య శాఖలో ఉన్నతాధికారుల జిమ్మిక్కులు

నెహ్రూసెంటర్, మార్చి 15 : జిల్లా వైద్య, ఆరోగ్యశాఖలోని కొందరు అధికారులు ప్రభుత్వం చెప్పినా వినడం లేదు. డిప్యుటేషన్లపై వెళ్లొద్దని ఆదేశాలిచ్చినా గతంలో పనిచేస్తున్న ప్రాంతాలకే వెళ్లి సేవలందిస్తున్నారు. రాష్ట్రప్రభుత్వం వైద్య విభాగంలోని అన్ని డిప్యుటేషన్లు రద్దుచేస్తూ గతనెల 7వ తేదీన ఉత్తర్వులు జారీ చేసినా వాటిని ఖాతరు చేయడం లేదు. తాజాగా ప్రభుత్వం డిప్యుటేషన్లు రద్దు చేసేనాటికి మహబూబాబాద్ జిల్లా నుంచి ఇతర జిల్లాల్లో తొమ్మిది మంది డిప్యుటేషన్లపై విధులు నిర్వహిస్తున్నారు. మహబూబాబాద్ జిల్లాలో 35 మంది విధులు నిర్వర్తిస్తుండగా, మొత్తం 44 మంది డిప్యుటేషన్లపై పని చేశారు. రాష్ట్ర ప్రభుత్వం డిప్యుటేషన్ల రద్దు చేయడంతో వారిని యథాస్థానాలకు వెళ్లాలని గతంలో ఇక్కడ పనిచేసిన జిల్లా అధికారి ఆదేశాలు జారీ చేశారు. ఈ క్రమంలోనే అత్యవసరం పేరిట 25మందికి ఇతర ప్రాంతాలకు పంపడానికి మరోలిస్టు తయారు చేసి ఫిబ్రవరి 12న కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్‌కు అందజేశారు. ఆ జాబితాలో అందరూ పాతవారే ఉండగా వారికి అనుమతివ్వడం గమనార్హం. ఇక ఆ జాబితాలో లేని ఉద్యోగులు కూడా పాత డిప్యుటేషన్లపైనే విధులకు హాజరవుతున్నారు. ఇదంతా జిల్లా ఉన్నతాధికారుల కనుసన్నల్లోనే జరుగుతున్నాయని విమర్శలు వినిపిస్తున్నాయి. జిల్లాలో వైద్య, ఆరోగ్యశాఖ అధికారుల పనితీరు సక్రమంగా లేదన్న విమర్శలు వినిపి స్తుండగా.. కొత్త డీఎంహెచ్‌వోగా బాధ్యతలు చేపట్టిన బి.కళావతిబాయి ఈ డిప్యూటేషన్ల దందాపై దృష్టిసారించాలన్న డిమాండ్ వినిపిస్తోంది.

డిప్యుటేషన్లు రద్దయినా..

ప్రస్తుతం డిప్యూటేషన్లు రద్దు అయినా.. తాజాగా రెగ్యూలర్ స్థానాల్లో విధులు నిర్వహించకుండా, ప్రభుత్వ ఉత్వర్వును బేఖాతరు చేస్తూ.. నిబంధనలను అతిక్రమిస్తూ పాత డిప్యూటేషన్ల స్థానాల్లో పనిచేస్తున్నారు. గార్ల మండలం ముల్కనూరు పీహెచ్‌సీలో హెల్త్ అసిస్టెంట్‌గా ఉన్న జి.వీరన్న తొర్రూరు పీహెచ్‌సీలో పాత డిప్యూటేషన్‌పై పని చేస్తున్నారు. మహబూబాబాద్ మండలం కంబాలపల్లి పీహెచ్‌సీలో టీబీహెచ్‌వీ ఉద్యోగి జె.సాయికృష్ణ తొర్రూరు పీహెచ్‌సీలో పాత బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు. దంతాలపల్లి మండల కేంద్రంలో ఉన్న పీహెచ్‌సీలో ల్యాబ్ టెక్నీషియన్‌గా ఉన్న బి.శరత్‌బాబు మహబూబాబాద్ జిల్లా ఆస్పత్రిలోని టి-హబ్‌లో పని చేస్తున్నారు. మహబూబాబాద్ మండలం కంబాలపల్లి పీహెచ్‌సీలో హెచ్‌ఈవో రామకృష్ణ మహబూబాబాద్ అర్బన్ పీహెచ్‌సీలో, ఇదే పీహెచ్‌సీలో రామారావు జిల్లా డ్రగ్స్ స్టోర్‌లో పాత డిప్యూటేషన్‌పై పని చేస్తున్నారు. కంబాలపల్లి పీహెచ్‌సీలో ల్యాబ్‌టెక్నీషియన్‌గా ఉన్న డీఎస్ రెడ్డి జిల్లా ఆస్పత్రిలో పాత డిప్యూటేషన్‌పై విధులను నిర్వర్తిస్తున్నారు. అత్యవసరం కోసం కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్‌కు పంపిన లిస్టులో వీరిపేరు కూడా లేదు. నిబంధనలు అతిక్రమించి విధులను నిర్వహిస్తున్నారు. ఇదే దారిలో మరికొంత మంది వైద్య ఉద్యోగులున్నారని సమాచారం.



తొర్రూరు పీహెచ్‌సీలో డిప్యూటేషన్‌పై విధులు నిర్వహిస్తున్న మహబూబాబాద్ మండల కంబాలపల్లి పీహెచ్‌సీలో టీబీహెచ్‌వీ ఉద్యోగి సాయికృష్ణ

కలెక్టర్ వద్దకు ఫైలు..

వైద్య ఆరోగ్యశాఖలో అన్నిరకాల డిప్యుటేషన్‌లను రద్దు చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అత్యవసరం ఉంటే కలెక్టర్ల ద్వారా డిప్యూటేషన్‌లను నియమించుకునే అవకాశాన్ని కల్పించింది. ఈ విషయాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ పూర్వ అధికారి 25 మందిని అత్యవసరం పేరిట డిప్యూటేషన్‌లు కల్పించాలని లిస్టు తయారు చేసి కలెక్టర్ వద్దకు ఫైల్‌ను పంపించారు. ఈ ఫైల్ కలెక్టర్ వద్ద పరిశీలనలో ఉన్నట్లు సమాచారం.

డిప్యుటేషన్ల రద్దు తర్వాత ఫిబ్రవరి 12న మహబూబాబాద్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో అత్యవసరం పేరుతో వివిధ విభాగాలకు జిల్లా వైద్యాధికారి 25 మంది పేర్లతో కూడిన జాబితాను తయారు చేశారు. డాక్టర్ సుధీర్‌రెడ్డి, జి.మురళీధర్, ఎ.మౌనిక, డి.సాగర్, ఎ.విజయ్‌కుమార్, పి.సర్వన్‌కుమార్, జి.రామారావు, వి.రామకృష్ణ, ఎం.మహేందర్‌రెడ్డి, జి.లోక్య, కె.వెంకటేశ్వర్‌రాజు, ఎ.పురుషోత్తం, కె.మంగమ్మ, ఎండీ.ఫైమోద్దీన్, వి.శ్రీనివాస్, డి.పుష్పలీల, సీహెచ్.సుజాత, పి.రాజేందర్, మనోహర్, పి.అరుణ్‌కుమార్, కె.జ్యోతి, బోడ తౌఫిక్, ఎస్‌డీ ఇస్మాల్‌బేగ్, సీహెచ్.ఎల్లయ్య, కోటేశ్వర్‌రెడ్డి ఉన్నారు.

ఉద్యోగులను వెనక్కి రప్పిస్తాం..

కళావతిబాయి, డీఎంఅండ్‌హెచ్‌వో, మహబూబాబాద్



జిల్లా వైద్య, ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న ఉద్యోగుల అన్నిరకాల డిప్యూటేషన్లను ప్రభుత్వం రద్దు చేసింది. మహబూబాబాద్ జిల్లాలో ఎవరైనా పాత డిప్యూటేషన్‌లపై పనిచేస్తున్నట్లయితే వారిని వెనక్కి రప్పిస్తాం. అత్యవసరం పేరిట గతంలో ఇక్కడ పనిచేసిన అధికారి పంపిన డిప్యూటేషన్ ప్రపోజల్ లిస్టును పరిశీలించి, సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్తా.

సరిగా అందని వైద్యసేవలు..

జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ పరిధిలో పనిచేస్తున్న వైద్యులు, ల్యాబ్‌టెక్నిషియన్స్, ఇతర సిబ్బంది రెగ్యులర్ స్థానాల్లో పనిచేయకుండా ఇతర ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తుండటంతో వారి రెగ్యూలర్ స్థానాల్లో రోగులకు సకాలంలో వైద్యసేవలు అందడం లేదు. దీంతో ప్రజలు వైద్యం కోసం జిల్లా కేంద్రంలోని ఇతర ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రజలకు అందుబాటులో ఉంచి వైద్యం అందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ఎక్కడ వారు అక్కడే పనిచేసేలా అన్ని డిప్యూటేషన్‌లను ఫిబ్రవరి 7న రద్దు చేయగా.. కొందరు ఉద్యోగులు తమ అనుకూలంగా ఉన్న ప్రాంతాల్లోనే పనిచేస్తుండటం గమనార్హం.

ఏజెన్సీ ప్రాంతాల అభివృద్ధికి కృషి

- మానుకోట ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్



సమావేశంలో మాట్లాడుతున్న భూక్య మురళీనాయక్

గూడూరు, మార్చి15 : ఏజెన్సీ ప్రాంతాలలోని ఆదివాసీ, గిరిజన గూడాల అభివృద్ధికి కృషి చేస్తానని మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. మట్టేవాడలో శుక్రవారం కాంగ్రెస్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో ఆదివాసీ గిరిజనులు సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారని, ఈ విషయం తమ దృష్టికి వచ్చినట్లు చెప్పారు. త్వరలోనే ఆయాగ్రామాల్లో సీసీ రోడ్లు, సైడ్‌కాల్వలు, తాగునీరు, వీధిలైట్ల ఏర్పాటుకు కృషి చేస్తానని చెప్పారు. వ్యవసాయం కోసం చెక్‌డ్యాంల నిర్మాణానికి నిధులు కేటాయిస్తానన్నారు. విద్యుత్ సౌకర్యంలేని తండాలు, గూడాలకు విద్యుత్ సౌకర్యం కల్పిస్తామని చెప్పారు. కాంగ్రెస్ నాయకులు మాధవపెద్ది రమేష్‌చందర్ రెడ్డి, ప్రదీప్‌రెడ్డి, చిట్టి వెంకటేశ్వర్లు, బొల్లికొండ మధు, వాసం వీరస్వామి, వాసం సమ్మయ్య, రేగ వెంకటేశ్వర్లు, శివ, శ్రీపాల్‌రెడ్డి, కొమ్మాలు పాల్గొన్నారు.

ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసిన ఎమ్మెల్యే

మహబూబాబాద్ రూరల్ : జిల్లా నూతన ఎస్పీగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన సుధీర్‌రామ్‌నాథ్‌ను జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎమ్మెల్యే మురళీనాయక్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్‌కు మొక్కను అందించి, శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

వినియోగదారులు హక్కులను వినియోగించుకోవాలి

- అదనపు కలెక్టర్ డేవిడ్



సమావేశంలో మాట్లాడుతున్న డేవిడ్

మహబూబాబాద్ టౌన్, మార్చి 15 : ప్రతీ ఒక్క వినియోగదారుడు బాధ్యతగా తమ హక్కులను వినియోగించుకుని, సేవలను పొందాలని అదనపు కలెక్టర్ డేవిడ్ అన్నారు. కలెక్టర్ కార్యాలయంలో ప్రపంచ వినియోగదారుల దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి రాజేందర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 2020 సంవత్సరంలో జిల్లా కలెక్టరేట్‌లో వినియోగదారుల సమాచార కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని చెప్పారు. వినియోగదారుల రక్షణ చట్టం-2019, వినియోగదారుల హక్కులు, బాధ్యతలు, వినియోదారుల ఫిర్యాదులు, పరిష్కారాలు మొదలగు అంశాలపై విపులంగా వివరించారు. సురక్షిత, నాణ్యమైన సరుకులు సేవలు పొందేహక్కు ప్రతీఒక్క వినియోగదారుడికి ఉంటుందని, అందులో ఏమైనా పొరపాట్లు, నష్టం జరిగితే సరైన న్యాయం పొందేందుకు ఫిర్యాదు చేసేహక్కు ఉంటుందన్నారు. దానికి వినియోగదారుల చట్టం ఉందని, తద్వారా సమస్యలను పరిష్కారం చేసి నష్టపరిహారం ఇప్పించేందుకు వినియోగదారుల ఫోరం పని చేస్తుందన్నారు. వినియోగదారులు ఈ చట్టాన్ని ఉపయోగించుకుని తమహక్కులను సాధించుకోవాలన్నారు. వినియోగదారులు కొనుగోలు చేసిన వస్తువులకు తప్పనిసరిగా బిల్లులు తీసుకోవాలని చెప్పారు. అనంతరం వినియోగదారుల పరిరక్షణ చట్టం, కృతిమమేథస్సు, సేవలు, ఫిర్యాదులు, బాధ్యతలకు సంబంధించిన కరపత్రాన్నిఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా అధికారులుకృష్ణవేణి, అభిమన్యుడు, మరియన్న, విజయ్‌కుమార్, వినియోగదారుల ఫోరం బాధ్యులు వి.సుధాకర్, షైన శ్రీనివాసులు పాల్గొన్నారు.

డీఎస్సీ ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, మార్చి 15 : జిల్లాకు చెందిన డీఎస్సీ పరీక్ష రాయనున్న ఎస్సీ అభ్యర్థులు ఉచిత శిక్షణకు ఈనెల 26వ వరకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి బాలరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. షెడ్యూల్డ్ కులాల అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి సంస్థ ద్వారా హన్మకొండ, మహబూబాబాద్ జిల్లాలకు చెందిన 100 మంది అభ్యర్థులకు ఏప్రిల్ 3వ తేదీ నుంచి జూన్ 2 వరకు రెండు నెలలపాటు హన్మకొండలో ఉచిత భోజన వసతి కల్పిస్తూ ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు tsstudycircle.com.in వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ ద్వారా మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు డైట్ లేదా బీ.ఎడ్ ఉత్తీర్ణతతో పాటు టెట్ ఉండాలన్నారు.

రికార్డు స్థాయిలో పసుపు ధర

- క్వింటాకు రూ.14,122

కేసముద్రం, మార్చి 15 : కేసముద్రం వ్యవసాయ మార్కెట్లో పసుపు రికార్డుస్థాయిలో ధర నమోదైంది. శుక్రవారం ఒక రైతు రెండుబస్తాల్లో పసుపు తీసుకురాగా, ఎలక్ట్రానిక్ నేషనల్ అగ్రికల్చర్ మార్కెట్ (ఈ-నామ్) విధానంలోని ఈ- వేలంలో ఏడుగురు వ్యాపారులు ధర నమోదు చేశారు. ఇందులో ఈశ్వర్ ట్రేడింగ్ కంపెనీ గరిష్ఠంగా రూ.14,122 ధర నమోదు చేసి, సరుకు కొనుగోలు చేసింది. గత దశాబ్దకాలంగా పసుపు క్వింటాకు రూ.6 వేల నుంచి రూ.8 వేల మధ్యనే ధర ఉండగా, ఈ సీజన్‌లో అత్యధికంగా రూ.14వేలు రేటు నమోదు అవుతోంది. అయితే పసుపు సాగుచేస్తున్న రైతులు మాత్రం వేళ్లమీద లెక్కించే సంఖ్యలోనే ఉండడం గమనార్హం.

అప్పుల తెలంగాణగా మార్చిన కేసీఆర్

ప్రభుత్వవిప్, ఎమ్మెల్యే రాంచంద్రనాయక్

దంతాలపల్లి, మార్చి 15 : మిగులు తెలంగాణను పదేళ్లలో కేసీఆర్ అప్పుల రాష్ట్రంగా మార్చారని ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే రాంచంద్రనాయక్ అన్నారు. శుక్రవారం ఆయన దంతాలపల్లిలో కల్యాణలక్ష్మి, తాగునీటిపై అధికారులతో సమీక్ష సమావేశం, ఉన్నత పాఠశాల విద్యార్థులకు పరీక్ష ప్యాడ్ల పంపిణీ, వారంతపు సంతను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన గ్యారెంటీలో భాగంగా ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్లు, ఆర్టీసీలో ఉచిత బస్సు ప్రయాణం మహిళలకు, రూ.500లకే గ్యాస్ తదితర హామీలను అమలు చేశామన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో పింఛన్లు తదితర కార్యక్రమాల అమలుకు శ్రీకారం చుట్టామన్నారు. డోర్నకల్ ప్రజలకు సేవా చేసే భాగ్యాన్ని ప్రజలు కల్పించారని, అందుకు నిత్యం వారిసేవలో ఉంటానన్నారు. త్వరలో పలు సం క్షేమ పథకాలను పల్లెల్లో విస్తరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. త్వరలో తెల్లరేషన్ కార్డులు జారీ చేస్తామన్నారు. మేలో తిరిగి ప్రజాపాలన దరఖాస్తులను స్వీకరించి సమస్యలను పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉమా, జడ్పీవైస్ చైర్మన్ నూకల వెంకటేశ్వర్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీవో విజయలక్ష్మి, ఎంపీటీసీ యాకన్న, సతీష్ పాల్గొన్నారు.



కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతున్న రాంచంద్రనాయక్

ఎన్నికల టూరిస్టులను నమ్మొద్దు

- ఎంపీ కవిత



బయ్యారంలో మాట్లాడుతున్న కవిత

బయ్యారం, మార్చి 15 : ప్రతిసారి ఎన్నికలు రాగానే టూరిస్టుల్లాగా వచ్చిపోయే నాయకులను నమ్మొద్దని మహబూబాబాద్ సిట్టింగ్ ఎంపీ, పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి కవిత అన్నారు. బయ్యారంలోని కోదండ రామచంద్ర స్వామి కల్యాణ మండపంలో శుక్రవారం మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి ముఖ్యకార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ నేతలు ఇచ్చిన మోసపూరిత హామీలను నమ్మి ప్రజలు కష్టాలు కొనితెచ్చుకున్నారన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో మళ్లీ ఆశీర్వదించాలన్నారు. అనంతరం ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావు, ఇల్లందు మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ నాయక్, జిల్లా పరిషత్ చైర్ పర్సన్ బిందు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రవికుమార్, శ్రీకాంత్‌నాయక్, మమత, సత్యనారాయణ, మురళీకృష్ణ, శ్రీను, లక్ష్మణ్‌నాయక్, వెంకన్న, భద్రయ్య, ఐలయ్య, వీరభద్రం, గణేష్, శివాజీ పాల్గొన్నారు.

మద్య నిషేధంతో ముందడుగు

- ప్రశాంతంగా, అన్నింటా ఆదర్శంగా పాటిమీది తండా
- ఐదేళ్లుగా మారిన గ్రామ స్వరూపం

గూడూరు, మార్చి 15 : ఆ ఊళ్లో గొడవల్లేవ్.. ఘర్షణలు అంతకన్నాలేవ్.. ప్రశాంత వాతావరణం.. దీనికి కారణం మద్యపాన నిషేధమే. బంధువులు వచ్చినా, పండుగలు జరిగినా గ్రామస్థులు తాగుడు జోలికి వెళ్లరు. దీంతో పల్లెలే దేశానికి పట్టుకొమ్మలన్న జాతిపిత మహాత్మాగాంధీ స్ఫూర్తితో గూడూరు మండలంలోని పాటిమీది తండా అభివృద్ధిలో ముందడుగు వేసి దూసుకుపోతోంది. జిల్లాలోనే అన్నింటా ఆదర్శంగా నిలుస్తోంది. గత ఐదు సంవత్సరాలుగా ఆ తండాలో మద్యపాన నిషేధం విజయవంతంగా అమలవుతోంది.

602 మంది జనాభా..

తండాలను గ్రామపంచాయతీలుగా ఏర్పాటు చేసిన సమయంలో 602మంది జనాభా ఉన్న పాటిమీదితండా కూడా గ్రామపంచాయతీగా ఏర్పడింది. ఆ తరువాత అన్ని రంగాల్లో ప్రగతిపథంలో పయనిస్తోంది. గ్రామపంచాయతీగా ఏర్పడిన తర్వాత తొలి సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన బానోత్ రాధానర్సింహానాయక్ తండాను అభివృద్ధి చేయాలని సంకల్పించారు. ప్రభుత్వ నిధులే కాకుండా ఇటు సొంత డబ్బును కూడా ఖర్చు చేస్తూ, పాటిమీదితండాను జిల్లాలోనే అగ్రగామిగా నిలిపేలా ఐదేళ్ల శ్రమించారు. తన సొంత ఖర్చులతో దుర్గామాత దేవాలయాన్ని నిర్మించడంతో పాటు, ప్రతీనెల వచ్చే గౌరవ వేతనాన్ని కూడా పాఠశాల అభివృద్ధికి అందించారు.



పాటిమీది తండా గ్రామ వ్యూ



తండాలో నిర్మించిన సీసీ రోడ్డు

నాటి సర్పంచ్ చొరవ.. అందరి సహకారంతో..

పాటిమీదితండాలో గిరిజనులు మద్యానికి బానిసై మృత్యువాత పడకుండా సర్పంచ్‌గా ఎన్నికైన తొలినాళ్లలోనే రాధానర్సింహనాయక్ గ్రామంలోని విద్యావంతులు, యువత, మహిళల సహకారంతో ఈ చెడు సంస్కృతిని గ్రామం నుంచి పారదోలాలని నిర్ణయించుకున్నారు. మద్యం విక్రయించినా, కొనుగోలు చేసినా.. వారి స్తోమతను బట్టి జరిమానా విధించాలని తీర్మానించారు. అంతేకాదు ఐదేళ్లుగా దీన్ని పక్కాగా అమలు చేస్తున్నారు. దీంతో తండాలో ఎలాంటి ఘర్షణలకు తావులేకుండా ప్రశాంతమైన వాతావరణం ఏర్పడింది. పండుగలు, శుభకార్యాలైనా, బంధుమిత్రులు ఎవరొచ్చినా మద్యం జోలికి వెళ్లే ప్రసక్తేలేదంటే అతిశయోక్తికాదు.

రూ.80 లక్షలకు పైగా నిధులతో పనులు..

ప్రగతి, సంక్షేమం సమర్థవంతంగా అమలు చేస్తే గ్రామం ఏదైనా సరే.. అభివృద్ధిలో దిక్సూచిలా నిలుస్తుంది. ప్రభుత్వ పథకాలను వినియోగించుకుంటూ ముందడుగు వేయడం ద్వారా పాటిమీదితండా అభివృద్ధిలో దూసుకుపోతోంది. రూ.80 లక్షలకు పైగా వెచ్చించి, వివిధ రకాల అభివృద్ధి, ప్రగతి పనులు చేపట్టారు. ఇందులో సీసీ రోడ్లు, సైడ్ డ్రెయినేజీ నిర్మాణం, అంతర్గత రోడ్ల పనులను పూర్తి చేశారు. ప్రభుత్వ పాఠశాలను ప్రైవేట్ పాఠశాల స్థాయిలో అభివృద్ధి చేశారు. తనకు సర్పంచ్‌గా ప్రతీనెల వచ్చే గౌరవ వేతనం కూడా పాఠశాల అభివృద్ధికి మాజీ సర్పంచ్ బానోత్ రాధా నర్సింహానాయక్ అందించేవారు. తన సొంత ఖర్చులతో రూ.15లక్షలతో గిరిజనుల ఆరాధ్య దైవం దుర్గమ్మ ఆలయాన్ని నిర్మించారు. గ్రామంలో నిత్యం తడిపొడి చెత్త సేకరణ పక్కాగా అమలు చేసేవారు. గ్రామంలోని ప్రకృతివనంలో ఏర్పాటు చేసిన మొక్కలు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. రాధానర్సింహానాయక్ నేతృత్వంలో ఈ స్ఫూర్తిని నిరంతరం కొనసాగిస్తామని గ్రామస్థులు చెబుతున్నారు.

గ్రామాన్ని అభివృద్ధి చేయడమే లక్ష్యం

బానోత్ రాధానర్సింహానాయక్, పాటిమీదితండా మాజీ సర్పంచ్



పాటిమీదితండాను జిల్లాలోనే అభివృద్ధిలో ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడమే లక్ష్యం. ఇప్పటికే నూటికి నూరు శాతం సీసీ రోడ్లు, ఇంటర్నల్‌రోడ్లు, సైడ్ కాలువల నిర్మాణాలతో పాటు విద్యుత్ దీపాల ఏర్పాటు చేశాం. గ్రామంలో ఐదేళ్లుగా సంపూర్ణ మద్యపాన నిషేధం అమలు చేయడంతో ఎలాంటి ఘర్షణలు జరగడం లేదు. నా సొంత ఖర్చులతో పాఠశాల అభివృద్ధితో పాటు దుర్గమ్మ దేవాలయాన్ని నిర్మించా. నా శక్తిమేర గ్రామాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తూనే ఉంటా.

శిలాఫలకాలు ధ్వంసం చేసిన వారిపై చర్య తీసుకోవాలి

సీపీకి ఫిర్యాదు చేసిన వినయభాస్కర్


సీపీకి పిర్యాదు చేస్తున్న వినయభాస్కర్ తదితరులు

రాంనగర్, మార్చి 15: బీఆర్ఎస్ ప్రభుత్వంలో వేసిన శిలాఫలకాలను ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ భాస్కర్ వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝాకు ఫిర్యాదు చేశారు. శుక్రవారం వినయభాస్కర్, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, మాజీ కుడా చైర్మన్ సుందర్‌రాజ్ తదితరులతో కలిసి సీపీని కలిశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత బీఆర్ఎస్ హయాంలో వేసిన శిలాఫలకాలను ధ్వంసం చేస్తున్నారని సీపీ దృష్టికి తీసుకువచ్చారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గత ప్రభుత్వం వేసిన శిలాఫలకం, ఇటీవల వడ్డెపల్లి ముదిరాజ్‌వాడలో శిలాఫలకాలను గుర్తుతెలియని వ్యక్తులు కూల్చివేశారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ శ్రేణులపై కొందరు కాంగ్రెస్ నేతలు బెదిరింపులకు పాల్పడుతున్నారని తెలిపారు. వారిపై చర్య తీసుకోవాలని వినయభాస్కర్ పోలీస్ కమిషనర్‌ను కోరారు.


అదనపు కమిషనర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న నూతక కార్యవర్గం

బల్దియా ఔట్‌సోర్సింగ్
డ్రైవర్ల సంఘం ఎన్నిక

వరంగల్ కార్పొరేషన్, మార్చి 15: గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ ఔట్ సోర్సింగ్ డ్రైవర్ల అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నికలు శుక్రవారం బల్దియా కార్యాలయం ఆవణలో జరిగాయి. ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు పుల్ల రమేష్ పర్యవేక్షణలో ఈఎన్నికలు జరిగాయి. ఏకగ్రీవంగా జరిగిన ఎన్నికలలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడుగా మేకల దేవేందర్ ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా నాగుల శ్రీకాంత్, కోశాధికారిగా దొడ్డిపాటి రాజేందర్, ఉపాధ్యక్షులుగా కొత్తపెల్లి కుమార్, కేతిరి పైడయ్య, కార్యదర్శిగా ఉసిల్ల ఆనందరావు, ప్రచార కార్యదర్శిగా మైనాల క్రాంతికుమార్, గుంజ రవి ఎన్నికయ్యారు. నూతన కమిటీని ఎన్నికల పర్యవేక్షకుల ఆధ్వర్యంలో ప్రమాణం చేయించారు. అనంతరం కమిటీ సభ్యులు మున్సిపల్ అదనపు కమిషనర్ అనిసుర్ రషీద్, సీఎంహెచ్‌వో మల్లం రాజేశ్‌ను కలిసి పుష్పగుచ్ఛాలు అందించారు. వార నూతన కమిటీని అబినందించారు. ఐఎన్‌టీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పాశం రవియాదవ్, ఐలయ్య, భైరబోయిన గట్టయ్య అధికారులను కలిసిన వారిలో ఉన్నారు.




కొత్తపల్లిలో బావిలో నుంచి పునుగు పిల్లిని బయటకు తీస్తున్న అటవీ శాఖ అధికారులు

కొత్తపల్లిలో బావిలో పడిన అరుదైన పిల్లి

భీమదేవరపల్లి, మార్చి 15: భీమదేవరపల్లి మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన నిమ్మ రాజిరెడ్డి అనే రైతు వ్యవసాయ బావిలో అరుదైన పిల్లి పడింది. ఈ విషయాన్ని గ్రామానికి చెందిన రేణుకుంట్ల రాజు, గ్రామస్థులతో పాటు హనుమకొండ అటవీశాఖ అధికారులకు తెలియజేశాడు. దీంతో శుక్రవారం మధ్యాహ్నం అటవీశాఖ అధికారులు, అటవీ శాఖ రిస్క్ టీమ్ బృందం స్పందించి బావిలో దిగి అరుదైన పిల్లిని బంధించారు. అనంతరం హనుమకొండ జూపార్క్‌కు తరలించారు. వైద్య పరీక్షలు నిర్వహించి, ఆరోగ్యంగా ఉన్నట్లయితే తిరుపతి జూపార్క్‌కు తరలిస్తామని అటవీ శాఖ అధికారులు తెలిపారు. ఈ పిల్లిని పునుగు పిల్లిగా భావిస్తున్నామని అటవీ శాఖ అధికారులు తెలిపారు. తిరుమల తిరుపతి అడవుల్లో ఎక్కువగా ఈ పునుగు పిల్లిలు సంచరిస్తాయని తెలిపారు.

అమ్మవారిపేట చెరువుకు
రామ్‌సర్ సైట్ హోదా

ఆ దిశగా పడుతున్న అడుగులు.. మొదలైన ప్రయత్నాలు

త్వరలో సందర్శించనున్న జీవవైవిధ్య నిపుణుల బృందం

రామ్‌సర్ సైట్ హోదాతో చెరువుకు అంతర్జాతీయ గుర్తింపు

హనుమకొండ, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : అనేక అరుదైన పక్షులకు ఆవాసమైన వరంగల్ నగర శివార్లలోని అమ్మవారిపేట చెరువుకు త్వరలో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన రామ్‌సర్ సైట్ హోదా లభించనున్నది. ఈ దిశగా అడుగులు పడుతున్నాయి. ఈ మేరకు ప్రయత్నాలు మొదలయ్యాయి. ఇందులో భాగంగా రామ్‌సర్ సైట్ జీవవైవిధ్య నిపుణుల బృందం అమ్మవారిపేట చెరువును సందర్శించేందుకు రానున్నది. కొద్ది రోజుల కిందటే ఈ బృందం రావలిసి ఉన్నప్పటికీ కొన్ని అనివార్య కారణాల వల్ల సందర్శన వాయిదా పడింది.

150కిపైగా పక్షులు

అమ్మవారిపేట చెరువు, దాని పరిసర ప్రాంతాల్లో అత్యంత అరుదైన, అంతరించిపోతున్న జాతులకు చెందిన, అలాగే పలు ఇతర దేశాలకు చెందిన 150 రకాల పక్షులు సంచరిస్తున్నాయి. వీటిలో 50 శాతం పక్షులు ఇతర దేశాల నుంచి వలస వచ్చిన పక్షులే. అన్ని రకాల పక్షులు ఒక చెరువును ఆవాసంగా చేసుకొని ఉండడం అరుదు. ఆ ఘనత అమ్మవారిపేట చెరువుకు దక్కుతుంది. తెలంగాణ రాష్ట్రంలో ఎక్కడా ఇలాంటి జీవవైవిధ్యం కలిగిన చెరువు లేదు. ఒకప్పుడు పాకాల సరస్సుకు ఈ ప్రత్యేకత ఉండేది. కానీ ఇప్పుడు అక్కడ అంతగా లేదు. అమ్మవారిపేట చెరువుకు వలస పక్షులు పెద్ద సంఖ్యలో తరలిరావడం, ఆవాసాలు ఏర్పాటు చేసుకోవడం ఇటీవల కాలంలో పెరిగింది. ఇందుకు అనువైన వాతావరణం ఉండడం ఒక కారణం.

నిపుణుల బృందం రాక

అమ్మవారిపేట చెరువు విశిష్టతను గుర్తించిన రామ్‌సర్‌సైట్ దీనిపై దృష్టి సారించింది. పలువురు పక్షి ప్రేమికులు, వణ్యప్రాణుల అభిమానులు చెరువు విశిష్టతను తెలియచేసే ఛాయాచిత్రాలతో డాక్యుమెంటేషన్ చేశారు. సమగ్ర సమాచారంతో నివేదికను రూపొందించారు. ఈ రెండింటిని రామ్‌సర్‌సైట్‌కు పంపించారు. వీటిని పరిశీలించిన ఈ సంస్థ చెరువు, దానిని అవాసంగా చేసుకున్న వివిధ రకాల పక్షులు, పరిసరాలు తదితర అంశాలను అధ్యయనం చేయడానికి ఒక నిపుణుల బృందాన్ని పంపాలని నిర్ణయించుకున్నది. నల్లగొండ జిల్లాకు చెందిన గుజ్జ బిక్షం ఈ బందంలో సభ్యులుగా ఉన్నారు. ఆయన చొరవతోనే అమ్మవారిపేట చెరువు రాంసర్ సైట్ జాబితాలో చేర్చే ప్రతిపాదన పరిశీలనకు వచ్చినట్టు సమాచారం.

రామ్‌సర్ సైట్ అంటే ఏమిటీ?

రామ్‌సర్ సైట్ అనేది చిత్తడి నేలల పరిరక్షణకు సంబంధించి అంతర్జాతీయ సహకారాన్ని అందించే ఒక వ్యవస్థ. ది కన్వెన్షన్ ఆఫ్ వెట్ ల్యాండ్స్ అని కూడా దీనిని పిలుస్తారు. యునెస్కో ఆధ్వర్యంలో ఇరాన్‌లోని రామ్‌సర్‌లో 1971 ఫిబ్రవరి 2న నిర్వహించిన ఒక సదస్సులో చిత్తడి నేలల సంరక్షణకు అంతర్జాతీయ సహకారాన్ని అందించేందుకు అంగీకరిస్తూ వివిధ దేశాలు సంతకాలు చేసిన ఒక ఒప్పందం. రామ్‌సర్‌లో ఈ ఒప్పందం కుదిరినందు వల్ల దీనికి రామ్‌సర్ సైట్ కన్వెన్షన్ అని కూడా పిలుస్తారు. రామ్‌సర్ సైట్ అంతర్జాతీయ ప్రాముఖ్యత కలిగిన చిత్తడి నేలలను గుర్తించడమే కాకుండా ప్రధానంగా నీటి పక్షుల (వాటర్ బర్డ్స్) ఆవాసాలను పరిరక్షించేందుకు తోడ్పాటును అందిస్తుంది. రామ్‌సర్ సైట్ ఏదైనా పక్షుల ఆవాసాన్ని గుర్తిస్తే దానికి రామ్‌సర్ సైట్ అని పేరుపెడతారు. ప్రపంచ వ్యాప్తంగా 2500 రామ్‌సర్ సైట్‌లు ఉన్నాయి. భారత దేశంలో 82 వరకు గుర్తించారు. ఏపిలో కొల్లేరు సరస్సుకు ఈ హోదా దక్కింది. తెలంగాణలో ఇప్పటి వరకు ఏ ఆవాసానికి ఈ గుర్తింపు రాలేదు. అమ్మవారిపేట చెరువుకు దక్కితే తెలంగాణలో రామ్‌సర్‌సైట్‌గా గుర్తింపు పొందిన మొదటి ఆవాసం ఇదే అవుతుంది. రామ్‌సర్‌సైట్‌గా గుర్తించడానికి తొమ్మిది అంశాలను పరిగణలోకి తీసుకుంటారు. ఇందులో ఏ ఒక్క ప్రమాణం పరిధిలోకి పక్షుల ఆవాసం వచ్చినా దానికి రామ్‌సర్ సైట్ గుర్తింపు వస్తుంది. అరుదైన లేదా ప్రత్యేకమైన చిత్తడినేల కలిగి ఉండడం, అంతరించిపోతున్న లేదా తీవ్రంగా అంతరించిపోతున్న పక్షి జాతులు కలిగిన ప్రాంతమై ఉండడం, నిర్దిష్టమైన జీవభౌగోళిక ప్రాంతమై అందులో జీవవైవిధ్యం కలిగిన మొక్క లేదా జంతు జాలం ఉండడం, పక్షులు, జంతుజాలాలు జీవిత చక్రాలలో క్లిష్టమైన దశను, ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటూ ఉండడం, ఒకే ప్రాంతంలో 20వేలు అంతకన్నా ఎక్కువ నీటి పక్షులు కలిగిన అవాసమై ఉండడం, ప్రపంచ జీవవైవిద్యానికి దోహదపడే ప్రాంతమై ఉండడం, వలసమార్గంలో పక్షులకు అనువైనా ఆవాసంగా ఉండడం, చిత్తడి నేలపై ఆధారపడిన నాన్ ఏవియన్ జంతు జాతుల జనాభలో కనీసం ఒక శాతమైన పరిక్షించే అవకాశం కలిగి ఉండడం ఈ ప్రమాణాల్లో ఉన్నాయి. రామ్‌సర్ సైట్‌లో గుర్తించే పక్షుల ఆవాస ప్రాంతాలను మూడు రకాలుగా వర్గీకరించారు. ఒకటి సముద్ర తీర చిత్తడి నేలలు, రెండవది లోతట్టు చిత్తడి నేలలు, మూడవది మానవ నిర్మిత చిత్తడి నేలలు. ఈ మూడవ కేటగిరి కిందికి అమ్మవారిపేట చెరువు వస్తుంది. ఆంధ్రప్రదేశ్‌లోని కొల్లేరు సరస్సును 2002 ఆగస్టు 19న రామ్‌సర్‌సైట్ జాబితాలో చేరింది.

భారీగా నిధులు

రామ్‌సర్ సైట్ జాబితాలోకి అమ్మవారిపేట చెరువు చేరిన పక్షంలో చెరువు, దానిని ఆవాసంగా చేసుకొని జీవిస్తున్న జంతుజాలాలు, ముఖ్యంగా నీటి పక్షుల సంరక్షణకు భారీగా నిధులు అందుతాయి. రామ్‌సర్ కన్వెన్షన్ బర్డ్‌లైఫ్ ఇంటర్నేషనల్, ఇంటర్నేషనల్ యూనియన్ ఫర్ కన్సర్వేషన్ ఆఫ్ నేచర్ (ఐయూసీఎన్) అనే ఈ సంస్థకు వెట్‌ల్యాండ్స్ ఇంటర్నేషనల్, ఇంటర్నేషనల్ వాటర్ మేనేజ్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ (ఐడబ్ల్యుఎంఐ), డబ్లుడబ్ల్యుఎఫ్ ఇంటర్నేషనల్, వైల్డ్‌ఫౌల్, వెట్ ల్యాండ్స్ ట్రస్ట్ (డబ్ల్యుడబ్ల్యుటీ) వంటి ఏజెన్సీల భాగస్వామ్యంతో పని చేస్తుంది. అమ్మవారిపేట చెరువు ఒక సారి ఈ సైట్‌హోదా లభిస్తే ఆ మొత్తం ప్రాంతం రామ్‌సర్ తన ఆధీనంలోకి తీసుకుంటుంది. నీటి పక్షులు సంరక్షణ ప్రాంతంగా ప్రకటిస్తుంది. ఆ ప్రాంతాన్నంతా పక్షులకు మరింత అనుకూలమైన ఆవాసంగా తీర్చిదిద్దుతుంది. పక్షలు వేటను నిషేదిస్తుంది. మానవ సంచారాన్ని పరిమితం చేస్తుంది. చుట్టు పక్కల క్వారీలను నిషేధిస్తుంది. చిత్తడినేల స్వభావాన్ని సంరక్షిస్తుంది. చెరువు, దాని చుట్టు ప్రక్కల ప్రాంతాల్లో నిర్మాణాలు, తవ్వకాలను కూడా నిసేధిస్తుంది. చెరువు సంరక్షణకు ప్రత్యేక సిబ్బందిని నియమిస్తుంది. జీవవైవిధ్య నిపుణుల పర్యవేక్షణ, అధ్యయనం, పక్షులు వలసలు, అరుదైన పక్షుల రాక, గుర్తింపు నిరంతర ప్రక్రియగా ఉంటుంది.

విద్యకు వెలుగు



- ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలకు ఉచిత విద్యుత్
- సర్కారు చదువులకు చేయూత
- ఉమ్మడి వరంగల్ జిల్లాలో 3,689 విద్యాలయాలకు ఉచిత విద్యుత్
- డిజిటల్ విద్య, పాఠశాల నిర్వహణకు ఊతం
- సర్వీస్ పర్సన్ల నియామకంతో బడుల్లో పారిశుధ్య నిర్వహణ మెరుగు

వరంగల్ ఎడ్యుకేషన్, మార్చి 15: ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలకు ఇక నుంచి జీవో విద్యుత్ బిల్లులే రానున్నాయి. ఆదివారం నాడు ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలకు ఉచిత విద్యుత్‌ను అందజేస్తామని ప్రకటించారు. అంతేకాకుండా పాఠశాలల్లో సర్వీస్ పర్సన్లను నియమిస్తామని చెప్పారు. దీంతో ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని పాఠశాలలు, కళాశాలలు కలిపి మొత్తం 3,689 విద్యాసంస్థలు ఇకపై విద్యుత్‌బిల్లులు చెల్లించాల్సిన పనిలేదు. విద్యుత్ బిల్లు కోసం ఇంతకు ముందు వినియోగించుకున్న పాఠశాల నిర్వహణ నిధులు ఇతర అవసరాలకు మళ్లించుకొనే అవకాశం లభించినట్లయ్యింది. ఇక కరోనా తర్వాత పాఠశాలల్లో పారిశుధ్యం పడకేసింది. పాఠశాలల్లో పారిశుద్ధ్య పనులు నిర్వహించేందుకు సిబ్బంది లేకపోవడంతో దుర్భరమైన పరిస్థితులు నెలకొని ఉన్నాయి. ప్రభుత్వం డిజిటల్ విద్య ప్రవేశపెట్టిన నేపథ్యంలో బడులకు ఉచిత విద్యుత్‌ను సరఫరా చేస్తే డిజిటల్ విద్యకు ఊతమివ్వడమే కాకుండా పాఠశాల నిర్వహణ డిజిటల్ విధానంలో మరింత సులువయ్యే అవకాశం పెరుగుతుంది.

డిజిటల్ విద్య, పాఠశాల నిర్వహణకు ఊతం

పాఠశాలల్లో ఉచిత విద్యుత్ సౌకర్యంతో ఇప్పటికే పాఠశాలల్లో ఏర్పాటు చేసిన డిజిటల్ విద్యకు ఊతమిచ్చినట్లు అవుతోంది. విద్యార్థులకు సులభంగా పాఠ్యాంశాలు అర్థమయ్యేందుకు గత ప్రభుత్వం ఐఎఫ్‌బీ ప్యానెల్స్‌ను ఏర్పాటు చేసింది. అంతకు ముందు కొన్ని పాఠశాలల్లో ప్రొజెక్టర్ డిజిటల్ విద్యాబోధన పరికరాలను ఏర్పాటు చేసింది. అయితే పాఠశాలల్లో వీటి వాడకాన్ని ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు నిర్ధేశిత సమయాల్లో మాత్రమే ఉపయోగిస్తున్నారు. పాఠశాల నిర్వహణ నిధులు రాక, కరెంట్ బిల్లులు చెల్లించలేక కొన్నిచోట్ల డిజిటల్ విద్యకు అంతరాయాలు ఏర్పడుతున్నాయి. ఇక నుంచి ప్రభుత్వం అందించనున్న ఉచిత విద్యుత్ సౌకర్యంతో పాఠశాలల్లో నిరంతరంగా డిజిటల్ పాఠ్యాంశాలు కొనసాగనున్నాయి. కరోనా అనంతరం పాఠశాల నిర్వహణ డిజిటలైజేషన్ అయ్యింది. విద్యార్థుల, ఉపాధ్యాయుల హాజరు, విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్, మధ్యాహ్న భోజన వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ ద్వారానే పంపిస్తున్నారు. ఇక ముందు నుంచి ఎలాంటి అవాంతరాలు లేకుండా పాఠశాల నిర్వహణ పనులు చేసుకోవచ్చును.

పాఠశాలల్లో మెరుగుపడనున్న పారిశుధ్యం

పాఠశాలల్లో సర్వీస్ పర్సన్లను నియమిస్తామన్న ముఖ్యమంత్రి ప్రకటనతో పాఠశాలల్లో పారిశుద్ధ్యం మెరుగుపడనున్నది. కరోనా అనంతరం పాఠశాలల్లో సర్వీస్ పర్సన్లు కరువైనారు. దీంతో పాఠశాలల్లో పారిశుద్ధ్యం పడకేసింది. కొన్ని పాఠశాలలకు వచ్చే నిర్వహణ నిధులు (కాంటింజెంట్ బిల్లుల)తోనే ప్రైవేటు వ్యక్తులకు నియమించుకొని తాత్కాలింగా పాఠశాలల ఆవరణలను శుభ్రం చేయించుకుంటున్నారు. ఉమ్మడి జిల్లాలోని అన్ని పాఠశాలల్లో పారిశుద్ధ్య కార్మికులు లేరు. అక్కడక్కడ ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయుల చొరవతో మాత్రమే కాంటింజెంటి వర్కర్లు పని చేస్తున్నారు. గత ప్రభుత్వం సంబంధిత మున్సిపాలిటీలు, గ్రామపంచాయితీల సిబ్బందితో పాఠశాలలను శుభ్రం చేయించేందుకు చర్యలు చేపట్టినప్పటికీ అది సాధ్యం కాలేదు. దాన్ని దృష్టిలో ఉంచుకున్న ప్రస్తుత ప్రభుత్వం పాఠశాలల్లో సర్వీస్ పర్సన్లను నియమించి పాఠశాలల్లో పారిశుద్ధ్య పనులను మెరుగు పరిచేందుకు పూనుకుంది.

ప్రతీ ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు

సమావేశంలో ముఖ్యమంత్రి మరో కీలక ప్రకటన చేశారు. ప్రతీ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు ఏర్పాటు చేసే విధంగా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీంతో అరకొర వసతులతో నడుస్తోన్న ప్రభుత్వ పాఠశాలల్లో ఇక నుంచి పూర్తి స్థాయిలో వసతులు సమకూరనున్నాయి. మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు సంబంధించిన పూర్తి స్థాయి మార్గదర్శకాలు రావాల్సి ఉందని విద్యాశాఖాధికారులు చెబుతున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు పాఠశాలల్లో అవసరమైన వసతులను గుర్తించి ప్రభుత్వానికి నివేదిస్తామని వారు చెబుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో ఇలా..

ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ప్రస్తుత వరంగల్ జిల్లాలో 740 పాఠశాలలకు ఉచిత విద్యుత్ సదుపాయం అందనుంది. హనుమకొండ జిల్లాలో 535, మహబూబాబాద్ జిల్లాలో 898, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 432, జనగామ జిల్లాలో 473, ములుగు జిల్లాలో 453 పాఠశాలలకు ఉచిత విద్యుత్ సౌకర్యాన్ని ప్రభుత్వం కల్పించనుంది. వీటితో పాటు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 35 జ్యోతిరావు పూలే బీసీ గురుకులాల్లో, 16 మైనారిటీ గురుకులాల్లో, 22 ఎస్సీ, 36 ఎస్టీ గురుకులాలతో పాటు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 49 ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు సైతం ప్రభుత్వం ఉచిత విద్యుత్ సౌకర్యాన్ని కల్పించనుంది.

జిల్లా	ప్రైమరీ	యూపీఎస్	హైస్కూల్స్	జూ.కళాశాలలు
వరంగల్	493	87	160	11
హనుమకొండ	318	72	145	9
మహబూబాబాద్	676	120	102	10
భూపాలపల్లి	319	44	69	5
జనగామ	297	64	113	7
ములుగు	366	46	41	7

రుద్రమ దశాబ్ది వార్షిక సమావేశాలు

- రేపు ఐదు గ్రంథాల అవిష్కరణ
- ఘనంగా జరగనున్న సాహిత్య సభలు

హనుమకొండ, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): రుద్రమ వార్షిక సమావేశాలు ఆదివారం హనుమకొండ లష్కర్ బజార్‌లోని ప్రభుత్వ ప్రాక్టీసింగ్ ప్రాథమిక పాఠశాలలో జరుగుతాయని ప్రముఖ కవయిత్రులు, రచయిత్రులు అనిశెట్టి రజిత, కొమర్రాజు రామలక్ష్మిలు తెలిపారు. ఈ సందర్భంగా రుద్రమ ప్రచురణలకు చెందిన ఐదు గ్రంథాల ఆవిష్కరణ జరుగుతుందని తెలిపారు. గ్రంథావిష్కర్తలుగా కథా, నవలా రచయితలు అంపశయ్య నవీన్, బీవీఎన్ స్వామి, తిరునగరి దేవకీదేవి, వీఆర్ విద్యార్థి, పొట్లపల్లి శ్రీనివాసరావులు ఈ సమావేశంలో పాల్గొంటారని చెప్పారు. గ్రంథ పరిచయకర్తలుగా మెట్టు రవీందర్, తెన్నేటి విజయ చంద్ర, సింగరాజు రమాదేవి, జి.చంద్రకళ, పి.మాలతీ పాల్గొంటారని తెలిపారు. సౌహార్ద్ర సందేశకులుగా నాగిళ్ల రామశాస్త్రి, డి.ధర్మయ్య, పి.చంద్, శ్రీ రంగ స్వామి, వల్లంపట్ల, పల్లేరు వీరస్వామి, నిధి, బి.రమా దేవి, బిల్ల మహేందర్ హాజరవుతారన్నారు. వివిధ సమావేశాలకు సమన్వయకర్తలుగా బండారి సుజాత, బిట్ల అంజనీదేవి, మరాడి శ్యామల, కొలిపాక శోభా రాణి, మదూరి అనిత వ్యవహరిస్తారని చెప్పారు. సభలకు అధ్యక్షత, నిర్వహణలు అనిశెట్టి రజిత, కొమ్మరాజు రామలక్ష్మిలు నిర్వహిస్తారు. ఓరుగల్లు సాహిత్య సంరంభానికి సాహితీవేత్తలు, కవులు, రచయితలు, కళాకారులు, సాహిత్యాభిమానులందరిని ఆహ్వానిస్తున్నట్టు వారు తెలిపారు. దక్షిణభారత దేశపు మొట్టమొదటి మహిళా పరిపాలకురాలైన కాకతీ రుద్రమ పేరున దశాబ్దం కిందట ప్రారంభించిన రుద్రణ ప్రచురణలు ఇప్పటి వరకు 15 గ్రంథాలను ప్రచురించిందని తెలిపారు.

మానుకోట లోక్‌సభ బరిలో ఆదివాసీ నేత

స్వతంత్ర అభ్యర్థిగా మైపతి అరుణ్‌కుమార్ పోటీ

ఆదివాసీల ఓట్లే తుడుందెబ్బ అధ్యక్షుడి లక్ష్యం



కొత్తగూడ, మార్చి 15: తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు, ఆదివాసీ విద్యావంతుడు మైపతి అరుణ్‌కుమార్ మానుకోట లోక్‌సభ నియోజకవర్గ బరిలో నిలుచోనున్నాడు. దాదాపు అన్ని ప్రధాన రాజకీయ పార్టీలు తమ అభ్యర్థులుగా లంబాడీ సామాజిక వర్గానికి చెందిన వారిని నిలబెట్టారు. ఆదివాసీల తరపున గత లోక్‌సభ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన డాక్టర్ అరుణ్‌కుమార్.. త్వరలో జరగనున్న ఎన్నికల్లో నిలబడనున్నారు.

ములుగు జిల్లా తాడ్వాయి మండలం కామారం గ్రామంలోని ఆదివాసీ వ్యవసాయ కుటుంబానికి చెందిన జగన్నాథరావు - సుగుణ దంపతుల రెండో కుమారుడు మైపతి అరుణ్‌కుమార్ ప్రభుత్వ పాఠశాలల్లో, కళాశాల్లో విద్యను అభ్యసించాడు. కాకతీయ యూనివర్శిటీలో ప్రభుత్వ పరిపాలన శాస్త్రంలో అడ్మినిస్ట్రేషన్ ఆఫ్ ట్రైబల్ డెవలప్‌మెంట్ ఆఫ్ ఇన్ 5, 6 షెడ్యూల్డ్ ఏరియాలపై పీహెచ్‌డీని పూర్తిచేశారు. ఆదివాసీ హక్కుల పోరాటం సమితి (తుడుందెబ్బ) సంఘంలో క్రియాశీలకంగా పనిచేస్తూ ఆదివాసీ హక్కులు, చట్టాలపై చేసిన పోరాటాల్లో, ఉద్యమాల్లో, పాదయాత్రల్లో పాల్గొన్నాడు. ప్రస్తుతం తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడిగా పోరాటాలు చేస్తున్నాడు.

కాగా, పార్లమెంటరీ విధానం ద్వారానే ఆదివాసీ హక్కులు, చట్టాల అమలు సాధ్యమవుతుందని గ్రహించిన అరుణ్‌కుమార్.. ఆదివాసీల ఓట్లు అధికంగా ఉన్న మానుకోట లోక్‌సభ నియోజకవర్గంలో గత 2019 పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేశారు. 57,073 ఓట్లు సాధించి మూడో స్థానంలో నిలిచాడు. గత ఎన్నికల్లో వచ్చిన ఓట్ల స్ఫూర్తితో త్వరలో జరగనున్న లోక్‌సభ ఎన్నికల బరిలో పోటీ చేయనున్నారు. మానుకోట లోక్‌సభ పరిధిలో అత్యధికంగా ఉన్న ఆదివాసీ ఓటర్లను ఏకంచేసి గెలుపు సాధించేందుకు అరుణ్‌కుమార్ వ్యూహరచన చేస్తున్నాడు.

నాలుగు ఉద్యోగాలకు ఎంపికైన సువర్ణ



ఉద్యోగ నియామకపత్రం అందుకుంటున్న సువర్ణ

పర్వతగిరి, మార్చి 15: ఒక ప్రభుత్వ ఉద్యోగానికే నానా తంటాలు పడుతున్న ప్రస్తుత తరుణంలో ఒక గృహిణి కష్టపడి ఏకంగా నాలుగు ప్రభుత్వ ఉద్యోగాలను సాధించింది. వరంగల్ జిల్లా పర్వతగిరి మండల కేంద్రానికి చెందిన పూజారి సువర్ణ ఏంఏ బీఈడీ చదివి తెలంగాణ గురుకుల ఉపాధ్యాయురాలు (టీజీటీ), పోస్ట్ గ్రాడ్యుయేషన్ ఉపాధ్యాయురాలు(పీజీటీ), గురుకుల జూనియర్ లెక్చరర్(జేఎల్) పోస్టులకు ఆగస్టు 2023 లో అప్పటి ప్రభుత్వం పరీక్షలు నిర్వహించగా పరీక్షలు రాసింది. కాగా, మార్చి 2024లో ఆయా పోస్టులకు చెందిన ఫలితాలు రావడంతో వరుసగా టీజీటీ, పీజీటీ, జేఎల్ మూడు పోస్టులకు ఎంపికైంది. వీటితో పాటు డీఎస్సీ 2008లో కూడా అర్హత సాధించినా... కోర్టు కేసు వల్ల జాప్యం నెలకొంది. ఇటీవల కోర్టు పరిష్కారం సూచించడంతో అందులోనూ ఉద్యోగం సాధించడంతో ఏకంగా నాలుగు ఉద్యోగాలు కైవసం చేసుకుంది. గృహిణిగా ఉంటూ తన భర్త పూజారి సురేష్ సహకారంతో తాను నాలుగు ఉద్యోగాలు సాధించినట్లు శుక్రవారం ఆమె తెలిపారు. ప్రస్తుతం ఇటీవల హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియం సీఎం రేవంత్‌రెడ్డి నిర్వహించిన కార్యక్రమంలో టీజీటీ ఉద్యోగం కోసం నియామక పత్రం తీసుకోగా, ఇతర ఉద్యోగాల కోసం నిర్వహించనున్న కౌన్సెలింగ్‌లో తనకు అనుకూలమైన ఉద్యోగంలో చేరే అవకాశాలు ఉన్నాయి.

తప్పుల తడకగా స్టాఫ్ నర్సు మెరిట్ లిస్ట్

తమ వారికి ఉద్యోగాలు ఇచ్చేందుకు అడ్డదారులు

వరంగల్ మెడికల్, మార్చి 15: హనుమకొండ జిల్లా వైద్య, ఆరోగ్యశాఖలో కాంట్రాక్టు స్టాఫ్‌నర్సు పోస్టుల భర్తీలో అక్రమాలు చోటు చేసుకున్నాయి. మెరిట్ ప్రొవిజినల్ లిస్టులో తప్పుల తడకగా ఉంది. ఒకే కోర్సులో మార్కులు ఇష్టారాజ్యంగా వేశారు. ఓ అభ్యర్థికి 2000 గరిష్ఠ మార్కులకు గాను 2018 మార్కులు వచ్చినట్లు మెరిట్ లిస్టులో చూపారు. మరో అభ్యర్థికి 1999 మార్కులు వచ్చినట్లు ప్రకటించారు. ప్రొవిజనల్ మెరిట్ లిస్టు చూసి నిరుద్యోగ అభ్యర్థులు లబోదిబోమంటున్నారు. వైద్య, ఆరోగ్యశాఖలో కాంట్రాక్టు నియామకాలన్నీ ప్రతీసారి వివాదంగానే మారుతున్నాయి. ఈసారి మాత్రం మార్కుల వింతతో తమ వారికి ఉద్యోగాలు ఇప్పించేందుకు భారీ ప్రయత్నాలకు తెరలేపారు. జిల్లా కలెక్టర్ ఇప్పటికైనా స్పందించి మెరిట్ లిస్టును సరిచేయాలని నిరుద్యోగ అభ్యర్థులు కోరుతున్నారు. అదేవిధంగా కొందరు అభ్యర్థులు జిరాక్స్ కాపీలపై ఎక్కువ మార్కులు వేసి దరఖాస్తు చేసినట్లు ఆరోపిస్తున్నారు. ఈ బాగోతం వెనుక కార్యాలయ ఉద్యోగులు కూడా ఉన్నారనే గుసగుసలు వినిపిస్తున్నాయి.

భట్టిని కలిసిన రామగళ్ల పరమేశ్వర్



డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో రామగళ్ల పరమేశ్వర్

హనుమకొండ సిటీ, మార్చి 15: వరంగల్ లోక్‌సభ కాంగ్రెస్ టికెట్ ఆశావహుడు డాక్టర్ రామగళ్ల పరమేశ్వర్ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కలిశారు. శుక్రవారం హైదరాబాద్‌లో భట్టిని కలిసి లోక్‌సభ టికెట్ కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. రాజకీయ జీవితం, సామాజిక కార్యక్రమాల నిర్వహణ తదితర అంశాలను భట్టికి విక్రమార్కకు విన్నవించి టికెట్ ఇప్పించాలని కోరారు.

వ్యక్తి ఆత్మహత్య

హనుమకొండ టౌన్, మార్చి 15: తాగుడుకు బానిసైన వ్యక్తి జీవితంపై విరక్తిచెంది ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం ఉదయం కాపువాడలో చోటు చేసుకుంది. హనుమకొండ పోలీసుల కథనం ప్రకారం.. నల్లాటి రవి ప్రైవేట్ హాస్పిటల్‌లో ల్యాబ్ టెక్నీషియన్‌గా పని చేసేవాడని, తాగుడు బానిసైన రవి ఒక్కోసారి వారం రోజులైనా ఇంటికి రాకపోయేవాడన్నారు. ఈనెల 14వ తేదీన రాత్రి ఇంటికి వచ్చిన రవి.. తెల్లారేసరికి ఇంట్లో నిచ్చెనకు ఉరి వేసుకుని కుటుంబసభ్యులకు కనిపించాడు. మృతుడి కుమారుడు సుమిత్ ఫిర్యాదు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. కాగా, రవికి కుమార్తెతోపాటు భార్య సునిత ఉంది.

నేడు నగరంలో విద్యుత్ ఉండని ప్రాంతాలు

హనుమకొండ టౌన్, మార్చి 15: విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా నగరంలోని పలు ప్రాంతాల్లో నేడు విద్యుత్ సరఫరా జరగదని హనుమకొండ టౌన్ డీఈ జిసాంబరెడ్డి తెలిపారు. ఆర్ఈసీ సబ్‌స్టేషన్ పరిధిలోని ప్రశాంత్‌నగర్ ఏరియాలో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, న్యూశాయంపేట సబ్‌స్టేషన్ పరిధిలోని వాసవి కాలనీ, దుర్గాదేవి కాలనీ, సిటిజన్ క్లబ్, మోక్షావిల్లాస్, న్యూశాయంపేట ఏరియాలో మధ్యాహ్నం 1నుంచి 4గంటల వరకు, గోపాల్‌పూర్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ ఉండదని తెలిపారు. వడ్డెపల్లి, వెస్ట్ సిటీ సబ్‌స్టేషన్ పరిధిలో సాయంత్రం 4గంటల నుంచి 6గంటల వరకు, సోమిడి, రాంపూర్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, టేకులగూడెం సబ్‌స్టేషన్ పరిధిలో మధ్యాహ్నం 3గంటల నుంచి 6గంటల వరకు విద్యుత్ సరఫరా జరగదని డీఈ తెలిపారు.

డిగ్రీ కోర్సుల సెమిస్టర్ ఫీజుల గడువు 30

కేయూ క్యాంపస్, మార్చి 15: కేయూ పరిధిలోని బీఏ, బీకాం, బీఎస్సీ ఇతర డిగ్రీ కోర్సుల 2,4,6 సెమిస్టర్ ఫీజులు చెల్లించుకునేందుకు మార్చి 30 వరకు గడువు ఉందని కేయూ పరీక్షలనియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీ రామోజు నరసింహచారి, డాక్టర్ ఎం.తిరుమలదేవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.50 అపరాధ రుసుంతో ఏప్రిల్ 4వరకు ఫీజులు చెల్లించుకోవాలని సూచించారు.

ఇల్లు విక్రయం పేరిట మోసం

కటకటాల పాలైన కానిస్టేబుల్ దంపతులు

వరంగల్ క్రైం, మార్చి 15: లేని ఆస్తులు ఉన్నట్లు చూపించి డబ్బులు తీసుకుని పలువురిని మోసం చేసిన ఎం.డి. ఖాసీం అనే హెడ్ కానిస్టేబుల్ కటకటాల పాలయ్యాడు. సుబేదారి సీఐ సత్యనారాయణ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. భూపాలపల్లి జిల్లాలో ఆర్మడ్ రిజర్వ్ విభాగంలో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న ఎం.డి. ఖాసీం.. తన భార్య సహీదాతో కలిసి గోపాల్‌పూర్, భద్రకాళి కాలనీలో ఒక ఇంటిని విక్రయిస్తామని ధర్మసాగర్ మండలం ముల్కపల్లికి చెందిన ఓదెల లక్ష్మీ వద్ద రూ.50వేలు అడ్వాన్స్‌గా తీసుకున్నారు. 2019లో డబ్బులు తీసుకున్న కానిస్టేబుల్ దంపతులు.. ఇంటి విషయం ప్రస్తావించినప్పుడు దాటవేస్తూ వస్తున్నారు. డబ్బులు తిరిగి ఇవ్వకపోవడంతో ఇటీవల బాధితురాలు లక్ష్మీ కానిస్టేబుల్ దంపతులపై ప్రజావాణిలో పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝాకు ఫిర్యాదు చేసింది. స్పందించిన కమిషనర్.. కానిస్టేబుల్ దంపతులపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని సుబేదారి సీఐని ఆదేశించారు. హెడ్ కానిస్టేబుల్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా మరో ఐదు కేసుల్లో బాధితుల నుంచి రూ.1కోటి 94లోల నగదు, 430గ్రాముల బంగారం తీసుకుని మోసం చేసినట్లు తేలింది. హనుమకొండ, మిల్స్‌కాలనీ, కాజీపేట, ధర్మసాగర్, సుబేదారి పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదైనట్లు విచారణలో బహిర్గతమైంది. విచారణ అనంతరం గత రాత్రి హెడ్ కానిస్టేబుల్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. ఈ విషయాన్ని సీఐ సత్యనారాయణరెడ్డి ధ్రువీకరించారు.

రైలింజన్‌లో సాంకేతిక లోపం

కాజీపేట, మార్చి 15: హైదరాబాద్ నుంచి సిర్పూర్ కాగజ్‌నగర్ వైపు వెళ్లే ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ రైలింజన్‌కు శుక్రవారం సాంకేతిక లోపం తలెత్తింది. కాజీపేట జంక్షన్‌నుంచి బయలుదేరి హసన్‌పర్తి రైల్వే స్టేషన్ దాటిన కొద్ది నిమిషాలకే రైలింజన్‌లో సాంకేతిక లోపం తలెత్తింది. ఇంజన్‌ను మరమ్మతులు చేసేందుకు రైల్వే అధికారులు చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. అక్కడే ఉన్న మరో ఇంజన్ తెప్పించగా అది కూడా మొరాయించింది. దీంతో మరో ఇంజన్ తెప్పించి ఇంటర్‌సిటీ బోగీలకు తగిలించి పంపించారు. ఇందుకు సుమారు రెండుగంటలు పట్టింది. దీంతో సికింద్రాబాద్ నుంచి డిల్లీ, చెన్నై నుంచి డిల్లీ వెళ్లే పలు రైళ్లను హసన్‌పర్తి రైల్వే స్టేషన్ సమీపంలో నిలిపివేశారు. ఇంటర్‌సిటీ రైలు వెళ్లిన తర్వాత మిగతా రైళ్లను పంపించారు. ఈ కారణంగా పలు రైల్లు ఆలస్యంగా నడిస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు.

ఇద్దరు సీఐ, ఎస్ఐల బదిలీ

వరంగల్ క్రైం, మార్చి 15: వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఇద్దరు ఇన్‌స్పెక్టర్లు, ఇద్దరు సబ్ ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన సీఐలలో ఎస్.కరుణాకర్ టాస్క్‌ఫోర్స్ నుంచి మహిళా పోలీస్ స్టేషన్(సుబేదారి), ఎస్.వెంకట్రాం మహిళా పోలీస్ స్టేషన్ నుంచి వీఆర్‌కు బదిలీ అయ్యారు. ఎస్ఐలలో బి.రామారావు హనుమకొండ నుంచి నల్లబెల్లి, ఎస్.నగేష్ నల్లబెల్లి నుంచి వీఆర్ బదిలీ అయ్యారు.


ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు అందని వేతనాలు

- పెండింగ్‌లో ఉన్న నెల రోజుల జీతం
- దయనీయ స్థితిలో శానిటేషన్ సిబ్బంది
- నూతన కమిషనర్ స్పందించాలని విజ్ఞప్తి

వరంగల్ కార్పొరేషన్, మార్చి 15 : వారు రెక్కాడితేగానీ డొక్కాడని పేద బడుగుజీవులు.. ఉదయం లేచి ప్రజలు ప్రశాంతంగా నడిచేందుకు రోడ్లను శుభ్రం చేసి చీపుర్లతో ఊడ్చి అద్దంగా దిద్దే ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు.. కానీ వారికి సమయానికి వేతనాలు రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. గ్రేటర్ వరంగల్ కార్యాలయంతో పాటు రెండు సర్కిల్ కార్యాలయాలు 12 సెంటర్లలలో సుమారు 3,000 మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు పనిచేస్తున్నారు. చెత్త శుభ్రం చేయడం మొదలుకుని చెత్తను తరలించేవారు, ప్రైవేటు జవాన్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, డ్రైవర్లు, స్వీపర్లు, అటెండర్లు మున్సిపల్ పరిధిలో పనిచేస్తున్నారు. వీరికి నెల జీతం వస్తే గానీ ఇళ్లు గడిచే పరిస్థితి ఉండదు. ఈ క్రమంలో గ్రేటర్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ప్రతీ నెల 20 తేదీ నుంచి 20 వరకు నెల రోజులుగా గుర్తించి ప్రభుత్వ ఖజానా నుంచి జీతాలు విడుదల చేస్తారు. అయితే డిసెంబరు మాసంలో నిర్వహించిన విధులకు సంబంధించిన జీతం జనవరి 20న డ్రా చేసుకున్నారు. కానీ జనవరి నెల జీతం ఫిబ్రవరి 20 వరకు కాకుండా మార్చి నెల సగం గడిచిపోయినా అందలేదు. జీతం తీసుకునే సమయం దాటి 15 రోజులు ముగిసిన అధికారులలో చలనం లేదని మండిపడుతున్నారు. జీతం రాక గాసం లేక ఇబ్బందితో అయోమయానికి గురవుతున్నారు. కొందరు ఇంటి అద్దె, పిల్లల ఫీజులు, చిల్లర సామాను, నెల వారి చిట్టీలు కట్టలేక తీవ్ర మనోవేదనకు గురవుతున్నట్లు చెప్పారు.

ఆలస్యం కావడంతో అందరికీ టెన్షన్

నెల దాటినా ఔట్‌సోర్సింగ్ కార్మికులకు జీతాలు బ్యాంకు ఖాతాల్లో జమ కాకపోవడంతో అందరిలో ఆందోళన మొదలైంది. కార్మికులు తరుచుగా సెల్‌ఫోన్‌కు ఎప్పుడు మెస్సేజ్ వస్తుందా? అని ఎదురు చూస్తున్నారు. ఇంకా కొందరు సఫాయి కార్మికులు తరుచుగా బ్యాంకుల వద్దకు వెళ్లి తమ ఖాతాలో డబ్బులు జమ అయ్యాయా? అని అధికారులను అడిగి తెలుసుకుంటున్నారు. జీతాలు రాకపోవడంతో కొందరికి ఆటోచార్జీలు లేక విధులకు గైర్హాజరు అవుతున్నట్టు చెప్పారు. అధికారులు స్పందించాలని ఉద్యోగులు కోరుతున్నారు. నూతన కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన అశ్విని వేతనాలపై దృష్టిసారించాలని కార్మికులు వేడుకుంటున్నారు.



బీజేపీ మండల అధ్యక్షుల నియామకం

మహబూబాబాద్ రూరల్, మార్చి 15 : జిల్లాలోని 15 మండలాలకు భారతీయ జనతా పార్టీ (బీజేపీ) అధ్యక్షులను నియమించినట్లు అధ్యక్షుడు యలమంచిలి వెంకటేశ్వర్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గార్ల అధ్యక్షుడిగా జంపాల శ్రీను, బయ్యారం రాసాల నరేష్‌యాదవ్, మహబూబాబాద్ మండల అధ్యక్షుడిగా మారగాని రాజుగౌడ్, నెల్లికుదురు భవానీప్రసాద్, గూడూరు గుండెబోయిన మల్లేష్, డోర్నకల్ బానోత్ గణేష్, కురవికి శ్రీరామోజు నాగరాజు, మరిపెడ ఆకుల హరికృష్ణ, చిన్నగూడూరు గుగులోతు లక్ష్మణ్, సీరోలు జోగి దిలీప్, నర్సింహులపేట కరుణాకర్, దంతాలపల్లికి గుండగాని భరత్, తొర్రూరు అర్బన్‌కు రవిబాబు, తొర్రూరు రూరల్ పులేందర్, పెద్దవంగరకు శ్యామ్‌ను నియమించినట్లు చెప్పారు.

నేడు బీజేపీ ఎంపీ అభ్యర్థి సీతారాంనాయక్ రాక

మహబూబాబాద్ రూరల్, మార్చి 15 : జిల్లాకు బీజేపీ మానుకోట ఎంపీ అభ్యర్థి అజ్మీర సీతారాంనాయక్ పర్యటించనున్నట్లు పార్టీ జిల్లా అధ్యక్షుడు యలమంచిలి వెంకటేశ్వర్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గూడూరు మండల కేంద్రానికి శనివారం ఉదయం 8.30 గంటలకు చేరుకుంటారు. కార్యకర్తలతో మాట్లాడి మహబూబాబాద్ మీదుగా గుండ్రాతిమడుగు చేరుకుని హనుమాన్ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అక్కడ్నుంచి కురవి వీరభద్రస్వామిని దర్శించుకోనున్నట్లు చెప్పారు. అక్కడ్నుంచి జిల్లా పార్టీ కార్యాలయానికి 11గంటలకు చేరుకుని కార్యకర్తలతో సమావేశం కానున్నట్లు తెలిపారు.

'విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి'

కేసముద్రం, మార్చి 15 : ఆర్థికంగా వెనుకబడిన విశ్వబ్రాహ్మణుల కోసం కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కేసముద్రం మండల స్వర్ణకార సంఘం అధ్యక్షుడు బోగోజు నాగేశ్వరాచారి డిమాండ్ చేశారు. కేసముద్రంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో నూతనంగా వివిధ కులాలకు కార్పొరేషన్లు ఏర్పాటు చేశారని, కులవృత్తిపై ఆధారపడి జీవిస్తున్న విశ్వబ్రాహ్మణుల పరిస్థితి దుర్భరంగా మారిందని అన్నారు. వీరి సంక్షేమం కోసం కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరారు.

కాలనీల్లో సమస్యలు పరిష్కరించాలి

● న్యూ డెమోక్రసీ రాష్ట్ర నాయకుడు మండల వెంకన్న


మునిసిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న న్యూ డెమోక్రసీ నేతలు

మహబూబాబాద్ టౌన్, మార్చి 15 : జిల్లా కేంద్రం శివారు కాలనీల్లో నెలకొన్న మౌళిక సమస్యలను పరిష్కరించాలని సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ రాష్ట్ర నాయకుడు మండల వెంకన్న డిమాండ్ చేశారు. పట్టణంలో న్యూ డెమోక్రసీ ఆధ్వర్యంలో శుక్రవారం ఖాళీ బిందెలతో ర్యాలీ నిర్వహించి, మునిసిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని పలుకాలనీల్లో అనేక సమస్యలు ఉన్నప్పటికీ పాలకులు, అధికారులు పట్టించుకున్న పాపాన పోవడంలేదన్నారు. కాలనీల్లోని ఇళ్లకు ఇంటి నెంబర్లు ఇవ్వాలని, విద్యుత్, తాగునీటి సౌకర్యం కల్పించడంతో పాటు ఆయాకాలనీల్లో సీసీరోడ్లు డ్రైనేజీ కాల్వలను నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. వేసవి ఆరంభమైన దృష్ట్యాకాలనీల్లో తాగునీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. సమస్యలను పరిష్కరించకుంటే ఆందోళనకు శ్రీకారం చుడుతామని హెచ్చరించారు. అనంతరం మునిసపల్ కార్యాలయంలో వినతిపత్రాన్ని అందజేశారు. ఎన్డీ నేతలు హెచ్.లింగన్న, తెలబోయిన లక్ష్మయ్య, ఎస్కే. బాబన్న, సామ పాపయ్య, కోటేష్, జబ్బర్, యాకన్న, కృష్ణ, కవిత, కల్యాణి, అనిత, కల్పన, ఉమా, జయ, లచ్చమ్మ, మంగమ్మ, వెంకటమ్మ, వేణు, సుజాత, మంజుల, హైమా పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కవిత అరెస్ట్ దుర్మార్గపు చర్య

● మాజీమంత్రి సత్యవతి రాథోడ్

మహబూబాబాద్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ, కాంగ్రెస్ కుమ్మక్కై ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఇంటిపై ఈడీ దాడులు, అరెస్టు చేయడం దుర్మార్గమైన చర్య అని మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్ శుక్రవారం ఒక ప్రకటనలో అన్నారు. ఎమ్మెల్సీ కవిత అరెస్టుపై మాజీమంత్రి సత్యవతి రాథోడ్ స్పందించారు. ఎమ్మెల్సీ కవితను ఎందుకు అరెస్టు చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఇన్నిరోజులు లేనిది పార్లమెంట్ ఎన్నికల ముందు ఈ అరెస్టు ఎంటని ప్రశ్నించారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను, బీఆర్ఎస్ పార్టీని రాజకీయంగా బలహీన పర్చడానికి ప్రధాని మోదీ కంకణం కట్టుకున్నారని చెప్పారు. ఈ బెదిరింపులకు బీఆర్ఎస్ నాయకులు భయపడరని ప్రజాక్షేత్రంలో రాజకీయంగా ఎదుర్కొంటామని తెలిపారు. చట్టపరంగా న్యాయస్థానంలో పోరాడుతామని స్పష్టం చేశారు.

వీరభద్రస్వామికి త్రిశూలస్నాన పూజ


వీరభద్రస్వామికి త్రిశూల స్నానపూజ నిర్వహిస్తున్న అర్చకులు

కురవి, మార్చి15 : వీరభద్రస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా శుక్రవారం భద్రకాళి సమేత వీరభద్రస్వామికి త్రిశూల స్నానపూజ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వైష్ణవ ఆలయాల్లో చక్రస్నానం తరహాలో, శైవ ఆగమశాస్త్రం ప్రకారం. వేదపండితులు స్వామివారికి, అమ్మవారికి కురవి పెద్దచెరువులో త్రిశూలస్నానం చేయించారు. వివిధ స్థలాల నదుల్లోని నీటిని కలశాల్లో తీసుకువచ్చిన అర్చకులు స్వామివారికి ప్రదక్షిణలు చేసి, స్నానమాచరింప చేశారు. దీంతో భక్తులు ఈపుణ్యస్నానానికి పెద్దసంఖ్యలో తరలివచ్చారు. ఈ పూజా కార్యక్రమాన్ని వేదపండితులు శ్రీకాంత్‌శర్మ, బాలకృష్ణ, ఆలయ అర్చకులు విజయ్, అనిల్, మాధవ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈవో సత్యనారాయణ, బాలగాని శ్రీనివాస్, సంగెం నాగరాజు, కర్నం ప్రసాద్, కన్నె వెంకన్న, పాల్గొన్నారు.

ఘనంగా వసంతోత్సవం..

వీరభద్రస్వామివారి వసంతోత్సవ కార్యక్రమాన్ని శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. రాబోయే కొత్త సంవత్సర చైత్రమాసానికి గుర్తుగా ఈ కార్యమాన్ని నిర్వహించారు. ఆలయం మొత్తం స్వామివారిని పూజించిన పసుపు నీళ్లు చల్లుతూ స్వామివారిని ఊరేగించారు. అంతకుముందు గురువారం రాత్రి 7గంటలకు ధ్వజపట ఉద్వాసన, శుక్రవారం తెల్లవారుజామున 5గంటలకు శివాలయం వద్ద దోపోత్సవ కార్యక్రమం నిర్వహించారు.

వైభవంగా నాగవెల్లి, ఏకాంతసేవ..

భద్రకాళి సమేత వీరభద్రుని కల్యాణోత్సవాల్లో శుక్రవారం రాత్రి స్వామివారి నాగవెల్లి, ఏకాంతసేవ కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా స్వామివారిని, అమ్మవారిని ప్రత్యేక సొమ్ములతో అలంకరించారు. అనంతరం ఏకాంతసేవా పూజను నిర్వహించారు.

'ఆశావర్కర్ల సమస్యలను పరిష్కరించాలి'


డీఎంఅండ్‌హెచ్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న వైద్య ఉద్యోగులు

మహబూబాబాద్ టౌన్, మార్చి15 : ప్రజా వైద్య, ఆరోగ్యశాఖలో పని చేస్తున్న ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ నాయకుడు వెలుగు శ్రావణ్, ఆశావర్కర్స్ యూనియన్‌నాయకులు సరిత, చంద్రకళ విజ్ఞప్తి చేశారు. ఇటీవల మహబూబాబాద్‌లో డీఎంఅండ్‌హెచ్‌వోగా బాధ్యతలు స్వీకరించిన కళావతి బాయిని మర్యాదపూర్వకంగా కలుసుకుని, శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వివిధ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 18 సంవత్సరాలుగా ఆశా వర్కర్లుగా పనిచేస్తూ ప్రజలకు, అధికారులకు వారధులుగా పని చేస్తున్నారని చెప్పారు. కరోనా కష్టకాలంలో తమప్రాణాలను సైతం పణంగా పెట్టి ఆశావర్కర్లు పని చేశారని వారిని రెగ్యూలరైజ్ చేసి, ఆదుకోవాలని కోరారు. రేణుక, జనని, సునిత, జ్యోతి, కమలత పాల్గొన్నారు.

● జిల్లా వైద్యాధికారిగా బాధ్యతలను స్వీకరించిన కళావతి బాయిని టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు వడ్డెబోయిన శ్రీనివాస్, వైద్య, ఆరోగ్యశాఖ ఫోరం జిల్లా అధ్యక్షుడు పమ్మి నాగబ్రహ్మాచారి, కార్యదర్శి మంగమ్మ మర్యాదపూర్వకంగా కలిశారు.

● డీఎంఅండ్‌హెచ్‌వో బాధ్యతలు స్వీకరించిన కళావతిబాయిని ప్రజాఆరోగ్య, వైద్య ఉద్యోగుల సంఘం 3194 శాఖ జిల్లా అధ్యక్షుడు వొబిలిశెట్టి రామకృష్ణ మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొప్పు ప్రసాద్, రవీందర్, మహేందర్‌రెడ్డి, రాజు, ఫైముద్దీన్ పాల్గొన్నారు.

వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న సుధాకర్

తొర్రూరు, మార్చి15 : మారుతున్న ప్రపంచ ప్రపంచీకరణ, గ్లోబలీకరణ పరిస్థితులలో వినియోగదారులు ఎల్లప్పుడు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వినియోగదారుల సమాచార కేంద్ర సంచాలకుడు వి.సుధాకర్ పిలుపునిచ్చారు. శుక్రవారం డివిజన్ కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల కామర్స్ విభాగం, వినియోగదారుల క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రపంచ వినియోగదారుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బొలగాని రాములు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రపంచలో వినియోగదారుల హక్కులపై అనేక ఉద్యమాలు, పోరాటాలు జరిగాయని చెప్పారు. గృహిణీ, రైతులు, సామాన్య ప్రజల ఎక్కువగా మోసపోతున్నారని తెలిపారు. మోస పోయేవాడు ఉన్నంత కాలం మోసం చేసేవాడు చేస్తూనే ఉంటాడని దీన్ని ఎదుర్కొనేందుకు ప్రతీ ఒక్కరు నడుం బిగించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రావుల నవీన్, రాధిక, బానోదు రెడ్డి, వెంకటరమణ, సునీత, రోహిణి, రమేష్, అంజుంఆరా పాల్గొన్నారు.

'రాజ్యాంగాన్ని రద్దు చేయడం ఖాయం'

మహబూబాబాద్ టౌన్, మార్చి15 : కేంద్రంలో బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే రాజ్యాంగం రద్దు చేయడం ఖాయమని, దేశ సమైక్యత కోసం వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో అలాంటి మతోన్మాద పార్టీని ఓడించాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.స్కైలాబ్‌బాబు పిలుపునిచ్చారు. మహబూబాబాద్ పెరుమాండ్లజగన్నాథంభవన్‌లో శుక్రవారంచింతఎల్లయ్య అధ్యక్షతన సంఘం జిల్లా కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన స్కైలాబ్‌బాబు మాట్లాడుతూ పదేండ్ల బీజేపీ పాలనలో దేశ వ్యాప్తంగా దళితులపై దాడులు, మహిళలపై వేధింపులు, అత్యాచారాలు పెరిగి పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటుపరం చేయడంతో సామాజిక న్యాయాన్ని సమాధి చేసిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఏప్రిల్ మాసంలో పూలే,అంబేద్కర్ జనజాతరలు నిర్వహిస్తున్నామని, కవులు, కళాకారులు, మేధావులు, బలహీన వర్గాల ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి దుడ్డెల రాంమూర్తి, వెంకన్న, హరినాయక్, లచ్చయ్య, యాకూబ్, మహేందర్, ఆనంద్, సురేందర్, సురేష్, స్వామి, మేఘన, స్వరూప, ఉప్పలయ్య , పద్మ పాల్గొన్నారు.

'గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం'

పెద్దవంగర, మార్చి15 : గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా రాష్ట్రప్రభుత్వం పని చేస్తున్నదని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముద్దసాని సురేష్ తెలిపారు. శుక్రవారం పోచారంలో రూ.10 లక్షల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో అంతర్గత సీసీ రోడ్డు పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల సమగ్రాభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం అధిక నిధులు కేటాయిస్తున్నదన్నారు. గ్రామాల అభివృద్ధి కోసం ప్రజలంతా స్వచ్ఛందంగా భాగస్వాములు కావాలని, అప్పుడే అన్నిరంగాల్లో అభివృద్ధి చెందుతాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారెంటీలను అర్హులైన లబ్ధిదారులకు అందిస్తామన్నారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు రంగు మురళిగౌడ్, కర్ణాకర్, దేవస్థాన డైరెక్టర్ తన్నీరు వేణు, గ్రామ పార్టీ అధ్యక్షుడు యాకన్న, బానోతు వెంకన్న పాల్గొన్నారు.

సుధాకర్‌రావు సేవలు చిరస్మరణీయం

● ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్

పెద్దవంగర, మార్చి 15 : మాజీ ఎమ్మెల్యే డాక్టర్ నెమురుగొమ్ముల సుధాకర్ రావు సేవలు చిరస్మరణీయమని ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్ అన్నారు. శుక్రవారం వడ్డెకొత్తపల్లిలో ఇటీవల గుండెపోటుతో మరణించిన సుధాకర్‌రావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. నియోజకవర్గంలో అభివృద్ధి కోసం ఆయన చేసిన సేవలను కొనియాడారు. సుధాకర్‌రావు కుటుంబసభ్యులతో ఉన్నఅనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో నెమురుగొమ్ముల ప్రవీణ్‌రావు, ముత్తినేని శ్రీనివాస్, బానోతు వెంకన్న, మల్లికార్జునచారి, యాకన్న తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరికలు

దంతాలపల్లి, మార్చి 15 : మండల కేంద్రంతో పాటు, దాట్ల గ్రామానికి చెందిన 20మంది కార్యకర్తలు బీఆర్ఎస్ నుంచి డోర్నకల్ ఎమ్మెల్యే రాంచంద్రనాయక్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ అభివృద్ధికి కాంగ్రెస్ కార్యకర్తలు సైనికుల్లా పని చేసి రానున్న పార్లమెంట్ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలుపునకు శ్రీకారం చుట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో దాట్ల ఎంపీటీసీ సతీష్, స్థానిక ఎంపీటీసీ యాకయ్య, నాయకులు నవీన్‌రెడ్డి, నర్సింహారెడ్డి, పోన్నోటి బాలాజీ, పోట్యానాయక్, భద్రూనాయక్ తదితరులు పాల్గొన్నారు.

● మరిపెడ రూరల్ : కాంగ్రెస్ ప్రభుత్వం అమలుచేస్తున్న అభివృద్ధి పథకాలను చూసి గిరిజనులు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పెండ్లి రఘువీరారెడ్డి చెప్పారు. కుద్యతండాలో జిల్లా ప్రధాన కార్యదర్శి గుగులోతు రవినాయక్, బావ్‌సింగ్ ఆధ్వర్యంలో భూక్యా లాలు, మాలోతు కీరు, చెన్నబోయిన వెంకన్న, జాటోతు శ్రీనివాస్, హస్సి, జాటోతు రమేష్, బాలు, లింగ్యా, మాజీ వార్డు మెంబర్లు బీఆర్ఎను వీడి కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు.

సొంత పార్టీ నాయకుల వల్లే ఓటమి

● మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్

దంతాలపల్లి, మార్చి 15 : అసెంబ్లీ ఎన్నికల్లో సొంత పార్టీ నాయకుల పనితీరు వల్లే తాను ఓటమి చెందానని డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్ అన్నారు. శుక్రవారం ఆయన మండలకేంద్రంలోని నాగిని ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన పార్లమెంటరీ సన్నాహక సమావేశంలో ఆయన ముఖ్యఅతిగా మాట్లాడారు. త్వరలో పార్లమెంట్ ఎన్నికలు వస్తున్న నేపథ్యంలో మహబూబాబాద్ పార్లమెంట్ అభ్యర్థిగా మాలోతు కవితను భారీ మెజార్టీతో గెలిపించేందుకు కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు ధర్మారపు వేణు, ఎంపీపీ ఉమామల్లారెడ్డి, జడ్పీ వైస్ చైర్మన్ నూకల వెంకటేశ్వర్‌రెడ్డి, నాయకులు వల్లాద్రి మల్లారెడ్డి, కిషోర్, వెంకట్‌రెడ్డి, రమణరెడ్డి, సోమేశ్వర్, మాజీ సర్పంచ్ సోమ్లా, నాయకులు రాములు, రామూర్తి పాల్గొన్నారు.

ప్రమాద బీమా.. కుటుంబానికి ధీమా

తొర్రూరు రూరల్, మార్చి 15 : ఖాతాదారులు చేసే బీమా కుటుంబానికి ఆర్థిక భరోసానిచే ధీమా వంటిదని ఏపీజీవీబీ నోడల్ అధికారి ఎస్.శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం నాంచారిమడూరులో బ్యాంకుల్లో అందించే ప్రమాద బీమా పాలసీలు, రుణాలపై అవగాహన కల్పించారు. ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన, సురక్ష బీమా యోజన, ఎస్‌బీఐ జనరల్ ఇన్సూరెన్స్‌ను రైతులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ప్రమాదవశాత్తు ఇటీవల చెట్టుపై నుంచి పడి మృతి చెందిన కుటుంబానికి రూ.20 లక్షల చెక్కునుఅందజేశారు. బ్యాంకు సిబ్బంది ప్రేమ్‌కుమార్, జ్యోతి, శ్రావణ్ పాల్గొన్నారు.

ఐదు గ్యారెంటీ పథకాలను అమలు చేశాం

మరిపెడ రూరల్, మార్చి15 : కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన వంద రోజుల్లోనే 5 గ్యారెంటీ పథకాలు అమలు చేశామని, మరో పథకాన్ని త్వరలోనే అమలు చేస్తామని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పెండ్లి రఘువీరారెడ్డి అన్నారు. శుక్రవారం మూలమర్రితండా జీపీ శివారు వాంకుడోతు తండాలో ఈజీఎస్‌లో మంజూరైన రూ.5లక్షలతో సీసీ రోడ్డు పనులను ఆయన ప్రారంభించి మాట్లాడారు. తెల్లరేషన్ కార్డుకలిగిన పేదలకు రూ.500లకే గ్యాస్ సిలిండర్‌ను ఇస్తున్నామన్నారు. ప్రతీ గృహానికి 200 వందల యూనిట్లు కరెంట్‌ను ఉచితంగా ఇస్తున్నామన్నారు. మరో పథకం మహిళలకు నెలకు రూ.2500 పెన్షన్‌ను త్వరలో అందజేస్తామన్నారు. మండల నాయకులువాంకుడోతు రవి, తేజావత్, నెహ్రూనాయక్, భూక్యా వెంకన్న, ధరావత్ శంకర్, ఉపేందర్, హుస్సేన్, నాగ పాల్గొన్నారు.

కాంగ్రెస్ సమావేశాన్ని సక్సెస్ చేయాలి

గార్ల, మార్చి 15 : ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య ఆధ్వర్యంలో 17న ఇల్లందు సమీపంలో బొజ్జాయిగూడెం సమ్మక్క, సారలమ్మ గద్దెల ప్రాగణంలోని పంక్షన్‌హాల్‌లో ఇల్లందు నియోజక వర్గస్థాయి కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని పార్టీ శ్రేణులు విజయవంతం చేయాలని మండల కాంగ్రెస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు తాళ్లపల్లి కిష్టాగౌడ్ అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. షంషాంద్‌బేగం మాజీ ఎంపీపీ మాలోత్ వెంకట్‌లాల్‌నాయక్, సుందరయ్య పాల్గొన్నారు.

'యాదవ సంఘ భవనానికి స్థలం ఇవ్వాలి'

కురవి, మార్చి 15 : మండల యాదవసంఘం అధ్యక్షుడిగా గుండ్రాతిమడుగు గ్రామానికి చెందిన జక్కుల హరిప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని తెలంగాణ యాదవ మహాసభ జిల్లా అధ్యక్షుడు రాజుయాదవ్ తెలిపారు. కురవిలో శుక్రవారం జరిగిన సంఘ సమావేశంలో ఆయన మాట్లాడారు. మండల కేంద్రంలో యాదవ సంఘం భవన ఏర్పాటుకు ప్రభుత్వం స్థలం కేటాయించాలన్నారు. జిల్లా సహాయ కార్యదర్శిగా పడాల మల్లయ్యను ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బాబురావుయాదవ్, రాకేష్‌యాదవ్, పెరుగు వేణుయాదవ్, పెద్దబోయిన రవి, నద్దునూరి లింగయ్య, ఎల్లావుల ఉపేందర్, కొండ లింగన్న, భద్రయ్య యాదవ్, గజ్జి బిక్షం పాల్గొన్నారు.

మహిళల అక్రమ రవాణాను నిర్మూలించాలి

బయ్యారం, మార్చి15 : బాలల, మహిళల అక్రమ రవాణాను నిర్మూలించటంలో గ్రామ నిఘా కమిటీల పాత్ర ముఖ్యమని బయ్యారం ఎంపీడీవో శ్రీనివాస్ అన్నారు. బయ్యారంలోని రైతువేదిక నందు శుక్రవారం ఎఫ్ఎంఎం, సాంఘిక సేవా సంస్థ వరంగల్ శాఖ ఆధ్వర్యంలో బాలల, మానవ అక్రమరవాణా నిర్మూలనపైన గ్రామ నిఘా కమిటీల పాత్ర అనే అంశంపై శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మాట్లాడారు. సంస్థ ప్రాజెక్టు కోఆర్డినేటర్ శ్రీకాంత్, ఏసీడీపీవో విజయలక్ష్మీ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు జ్యోతి, సర్దార్‌బీ, సంస్థ ఫీల్డ్‌కోఆర్డినేటర్లు సమరం, నిర్మల, శిరీషతో పాటు పంచాయతీ కార్యదర్శులు, అంగన్వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు, మహిళా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

మీర్యాతండాలో పూరిగుడిసె దగ్ధం


కస్నాతండాలో దగ్ధమైన పూరిగుడిసె

తొర్రూరు రూరల్, మార్చి 15 : కంఠాయపాలెం గ్రామ శివారు కస్నాతండా పరిధిలోని మీర్యాతండాలో శుక్రవారం జరిగిన విద్యుదాఘాతంతో ఓ పూరిగుడిసె దగ్ధమైన సంఘటన చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం. మీర్యాతండాకు చెందిన గుగులోతు శ్రీనుకు చెందిన తాటికమ్మలతో కప్పిన గుడిసె శుక్రవారం మధ్యాహ్నం విద్యుత్‌షార్ట్ సర్క్యూట్‌తో వెనుకభాగం దగ్ధమైంది. తండావాసులు అప్రమత్తం కావడంతో ప్రమాదం తప్పిందన్నారు. ఇంట్లో ఉన్న వంటసామగ్రి కొంతమేర దగ్ధమైనట్లు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

తొర్రూరు, మార్చి 15 : పట్టణ కేంద్రంలో 11కేవీ లైన్ మెయింటెనెన్స్ కారణంగా శుక్రవారం విద్యుత్ సరాఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ వంశీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి 11 వరకు ప్రతిభానగర్, బీరప్పనగర్, బస్టాండ్ ఏరియా, శ్రీకృష్ణకాలనీ, గొల్లబజార్, పార్కు రోడ్డు, ఎస్సీ కాలనీలో విద్యుత్ సరాఫరాలో అంతరాయం కల్గుతుందని తెలిపారు. వినియోగదారులు, వ్యాపారులు సహకరించాలన్నారు.

'అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల నిబంధనలు సవరించాలి'

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, మార్చి15 : అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఏర్పాటు నిబంధనలు సవరించాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీశైలం, విష్ణువర్ధన్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి పర్యవేక్షణ, నిధుల వినియోగం మొదలగు పనుల కోసం గతంలో ఉన్న పాఠశాల యాజమాన్య కమిటీ (ఎస్ఎంసీ)ల స్థానంలో విద్యాశాఖ అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీను వెంటనే ఏర్పాటు చేయాలనే నిబంధనలు సమీక్షించాలన్నారు. కమిటీల నియామకాలను ఈనెల 15న ఒక్కరోజే చేపట్టాలని, వెంటనే చైర్మన్, కన్వీనర్ల పేరున బ్యాంక్ ఎకౌంట్ తీయాలనడం ఎలా సాధ్యమవుతుందన్నారు. కమిటీ చైర్మన్‌గా ఆ పాఠశాల విద్యార్థి తల్లి ఉండేలా లేదా కనీసం ఆ ఆవాస ప్రాంతంలో నివాసం ఉండే వారినే నియమించే విధంగా చూడాలన్నారు.

'విద్యార్థులకు చేయూతనందించడం అభినందనీయం'

కేసముద్రం, మార్చి 15 : మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లోని కొద్ది రోజులుగా సుమారు 850 మంది విద్యార్థులకు సమ్మిగౌడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.2.4 లక్షల విలువైన పరీక్ష ప్యాడ్‌లు, స్టేషనరీని పంపిణీ చేయడం అభినందనీయమని తహసీల్దార్ దామోదర్ అన్నారు. కల్వల హైస్కూల్లో శుక్రవారం విద్యార్థులకు ఫౌండేషన్ తరఫున ప్యాడ్‌లు, స్టేషనరీ సామాగ్రిని తహసీల్దార్ చేతుల మీదుగా అందజేశారు. ఫౌండేషన్ వ్యవస్థాపకుడు చిలువేరు సమ్మయ్యగౌడ్, నోడల్ హెచ్ఎం కొత్త జగన్మోహన్‌రెడ్డి, హెచ్ఎం బండారు నరేందర్, గండి శ్రీనివాస్, సామల నర్సయ్య, మూరగుండ్ల అనంతరాములు, చిట్ల రవి, చిలువేరు సాయిగౌడ్, పెదగాని రవి పాల్గొన్నారు.

కమ్మ కార్పొరేషన్ ఏర్పాటు హర్షనీయం

● ఆ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నాగేశ్వర్‌రావు

మహబూబాబాద్ టౌన్, మార్చి 15 : రాష్ట్రంలో కమ్మ కార్పొరేషన్ ఏర్పాటు చేస్తున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడం హర్షనీయమని సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు మట్టూరి నాగేశ్వర్‌రావు అన్నారు. మహబూబాబాద్‌లో శుక్రవారం నిర్వహించిన సంఘ సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డితో పాటు కార్పొరేషన్ ఏర్పాటుకు కృషి చేసిన వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, ఎంపీ రేణుకచౌదరి, కమ్మ సంఘం రాష్ట్ర నేతలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి నామసైదులు, చల్లగుండ్ల రాజేష్, ప్రభాకర్, నాగేశ్వర్, లెనిన్ పాల్గొన్నారు.

ఆదివాసీ కాంగ్రెస్ మానుకోట పార్లమెంటరీ నియోజకవర్గ

కోఆర్డినేటర్‌గా వెంకట్‌నాయక్



మహబూబాబాద్ టౌన్, మార్చి 15 : ఆదివాసీ కాంగ్రెస్ మానుకోట పార్లమెంటరీ కో-ఆర్డినేటర్‌గాపట్టణానికి చెందిన గుగులోతు వెంకట్‌నాయక్ నియామకమయ్యారు. త్వరలో జరగబోయే పార్లమెంట్ ఎన్నికలను పురస్కరించుకుని ఏఐసీసీ ఆదేశాల మేరకు ఆదివాసీ కాంగ్రెస్ రాష్ట్రంలో 17 పార్లమెంటరీ నియోజకవర్గాలకు కోఆర్డినేటర్లను నియమిస్తూ జాతీయ వైస్‌చైర్మన్ బెల్లయ్యనాయక్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. అందులో భాగంగావెంకట్‌నాయక్‌ను మానుకోట పార్లమెంటరీ నియోజకవర్గ కోఆర్డినేటర్‌గా నియమించింది. తన నియామకానికి కృషి చేసిన ప్రతీ ఒక్కరికి వెంకట్‌నాయక్ కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా తాను అహర్నిశలు కృషి చేస్తానని స్పష్టం చేశారు.

డోర్నకల్ ఎస్సైగా తిరుపతి



డోర్నకల్, మార్చి 15 : డోర్నకల్ ఎస్సైగా కొగిల తిరుపతి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. 2020 ఎస్సై బ్యాచ్‌కు చెందిన తిరుపతి గతంలో కేసముద్రం ఎస్సైగా రెండేళ్లపాటు పనిచేశారు. అక్కడ్నుంచి బదిలీపై డోర్నకల్ ఎస్సైగా వచ్చి బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పని చేసిన రియాసీన్ కొద్దిరోజుల క్రితం చిన్నగూడూరు ఎస్సైగా బదిలీ చేశారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

గూడూరు, మార్చి 15 : దామరవంచ గిరిజన బాలుర గురుకుల పాఠశాలలో శుక్రవారం 80 మంది పదో తరగతి విద్యార్థులకు అదే గ్రామానికి చెందిన మహిళ కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షురాలు భూక్య పద్మ పరీక్ష సామగ్రిని అందించారు. ఈ సందర్భంగా భూక్య పద్మ మాట్లాడారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ముత్తయ్య ఉపాధ్యాయులు పాల్గొన్నారు.